


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com
E-mail : vspnews@gmail.com

# విశాఖ సమాచారం

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 200 విశాఖపట్నం, 23 మే 2025 శుక్రవారం పేజీలు : 8 వెల : రూ.2.00



# తీరు మారకుంటే తొక్కేస్తాం

- పాకిస్తాన్‌కు ప్రధాని మోదీ వార్నింగ్

**బికనీర్:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి ప్రతిగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో 22 నిమిషాల్లోనే ప్రతీకారం తీర్చుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రతీ ఉగ్రవాద దాడికి పాకిస్తాన్ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాజస్థాన్‌లోని బికనీర్‌లో అమృత్ భారత్ స్టేషన్లను ప్రారంభించిన అనంతరం పలానాలో జరిగిన ప్రజా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఉగ్రదాడులకు పాల్పడుతున్న పాకిస్తాన్ భారీ మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని, అది ఆ దేశ సైన్యం, ఆర్థిక వ్యవస్థ భరించాల్సి వస్తుందన్నారు. పాక్ ఉగ్రవాదం ఎగుమతిని కొనసాగిస్తే, ఆ దేశం ఒక్క రూపాయి కోసం కూడా తడబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. భారతీయుల రక్తంతో ఆడితే పాకిస్తాన్ దానికి భారీ మొత్తంలో నష్టం చవిచూడాల్సి వస్తుందన్నారు.

ఉగ్రవాదం అంతానికే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని, ఇకపై ఉగ్ర దాడి జరిగినట్లయితే, తక్షణమే దానికి కఠిన ప్రతిస్పందన ఉంటుందని స్పష్టంచేశారు. ఇందుకు సమయాన్ని, విధానాన్ని, నిబంధనలను భారత సైన్యం స్వయంగా నిర్ణయిస్తుందన్నారు. అణ్వాయుధాల బెదిరింపులతో భారతదేశం వెనక్కి తగ్గబోదని చెప్పారు. పాకిస్తాన్‌లో 'స్టేట్', 'నాన్-స్టేట్ యాక్టర్స్' (గూండాలు) కలసి ఆడే ఆటలు ఇక కొనసాగవన్నారు. 22వ తేదీన జరిగిన పాక్ దాడికి ప్రతిగా 22 నిమిషాల్లో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం చేశామని ప్రధాని గుర్తుచేశారు.

భారత్ ప్రతీకార దాడి చేస్తే ఫలితం ఎంత ఘోరంగా ఉంటుందో ప్రపంచానికి స్పష్టంగా చూపించామని, ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని నేలమట్టం చేయాలనే సంకల్పంతో ఉన్నారదన్నారు. భారత సైన్యం ప్రజల ఆశీర్వాదంతో ఆ సంకల్పాన్ని నెరవేర్చిందన్నారు. భారత ప్రభుత్వం మూడు దళాలకూ పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. పాకిస్తాన్‌ను మోకాళ్లపై సాగిలపడేలా చేయడానికి భారత సైన్యం చక్రవ్యూహం రచించిందని ప్రధాని మోదీ అన్నారు. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా మే 7న భారత్ ప్రతీకార సైనిక చర్య ప్రారంభించింది. ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఆపరేషన్ సమయంలో జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ తదితర ఉగ్రవాద గ్రూపులతో సంబంధమున్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.

## 103 అమృత్ స్టేషన్లు ప్రారంభం



**బికనీర్:** ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని ఎనిమిది స్టేషన్లతో సహా 18 రాష్ట్రాలలో 103 పునరాభివృద్ధి చేసిన అమృత్ స్టేషన్‌లను గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాలో ఒకరోజు పర్యటనలో ఉన్న ప్రధాని ముందుగా రాజస్థాన్‌లో రూ. 26 వేల కోట్ల విలువైన కీలకమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ ప్రాజెక్టులను ప్రారంభించారు. తొలుత ప్రధాని భారత వైమానిక దళానికి చెందిన నల్ ఎయిర్ బేస్‌కు చేరుకున్నారు. అక్కడి దేశ్‌నోక్‌లోని కర్ణి మాత ఆలయంలో ప్రార్థనలు చేశారు. అనంతరం రాష్ట్రంలోని ఎనిమిది స్టేషన్లతో సహా 18 రాష్ట్రాలలో 103 పునరాభివృద్ధి చేసిన అమృత్ స్టేషన్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే బికనీర్-ముంబై ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి

...(మిగతా 2లో)

# సాగు ప్రణాళికపై ప్రత్యేక దృష్టి

**ఏ పంటలు సాగు చేయాలో రైతులకు ముందే చెప్పాలి : సీఎం చంద్రబాబు**

**ఈ ఏడాది హెచ్డీ బర్లే పొగాకు రకానికి క్రాప్ హాలిడే**

**తిరుమల భక్తులకు మ్యాంగో జ్యూస్!**

**క్యాబినెట్ సబ్ కమిటీతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్**



**అమరావతి, విశాఖ సమాచారం:** పంటల వారీ సాగు ప్రణాళికపై వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఏ పంటలు ఎంతమేర విస్తీర్ణంలో సాగు చేయాలో రైతులకు ముందే చెప్పడం వల్ల డిమాండ్, సప్లయ్ మధ్య సమతూకం ఉంటుందన్నారు. పొగాకు, కోకో, మామిడి, ధాన్యం రైతుల సమస్యలపై సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం అధికారులు, పంటలు, గిట్టుబాటు ధరలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీతో ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పంటల ప్రణాళిక అనేది చాలా శాస్త్రీయంగా జరగాలని, జాతీయ అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్లు, దిగుబడులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్టీజీఎస్, వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న స్వల్పకాలిక,



# థియేటర్‌లో ప్రత్యక్ష ప్రసారం

**రావివలస గ్రామస్థులతో పవన్ ముఖాముఖి**

**వినూత్న కార్యక్రమానికి శ్రీకారం**

**టెక్కలి:** ప్రజా సమస్యల పరిష్కారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వెండితెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామస్థులతో గురువారం మాట్లాడారు. 'మన ఊరు-మాటా మంతి' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని టెక్కలిలోని భవానీ థియేటర్‌లో నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులపైనా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# 'అమరావతి'కి అంత ఖర్చా

- కేసీఆర్ రూ.616 కోట్లతో సెక్రటేరియట్ నిర్మించారు
- మీకెందుకంత బడ్జెట్?
- గతంలో అసెంబ్లీ, సచివాలయం కట్టారు.. ఇప్పుడు మళ్లీ కొత్త బిల్డింగులెందుకు?
- రూ.600 కోట్లు వృధా కదా? ప్రజలపై అప్పుల భారం భావ్యమా?
- కూటమి పాలనపై మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం



**తాడేపల్లి, విశాఖ సమాచారం:** హైదరాబాద్‌లో కేసీఆర్ 8 లక్షల స్క్వేర్ ఫీట్లలో రూ.616 కోట్లతో అద్భుతమైన సెక్రటేరియట్ నిర్మించారు.. చంద్రబాబు నాయుడు 53,57,000 స్క్వేర్ ఫీట్లలో సెక్రటేరియట్ నిర్మిస్తామనడం ఏంటి ? అని వైసీపీ అధినేత వైఎస్‌జగన్ ప్రశ్నించారు. అమరావతిలో 600 కోట్ల రూపాయలు ఖర్చు చేసి గతంలో అసెంబ్లీ, సచివాలయాలు భవనాలు కట్టి..ఇప్పుడు వాటిని వదిలేసి మళ్లీ అసెంబ్లీ సచివాలయాలు కడతానని చెప్పడం వృధా కాదా అని ప్రశ్నించారు. తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులలో మాట్లాడుతూ.. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ అంటూ అందరినీ మభ్యపెడుతున్నారని అన్నారు. అదే అమరావతి కోసం చేస్తున్న అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. చంద్రబాబు చేస్తున్న పనికి విజయవాడ గుంటూరులో రియల్ ఎస్టేట్ పడిపోయింది

...(మిగతా 2లో)

## జూన్ 4న వెన్నుపోటు దినం

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో.. ఎన్నికల ఫలితాలు వెలువడిన తేదీ జూన్ 4వ తేదీని

...(మిగతా 2లో)



# కొత్త రేషన్‌కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు

**మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ, విశాఖ సమాచారం:** రేషన్‌కార్డు కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దరఖాస్తు స్వీకరించిన 21 రోజుల్లో దాన్ని పరిష్కరిస్తామని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమంటూ జరుగుతున్న

...(మిగతా 2లో)

# సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

**హోం మంత్రి అనిత**

**ఘనంగా అనకాపల్లి జిల్లా మినీ మహానాడు**






**నక్కపల్లి, విశాఖ సమాచారం:** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో మినీ మహానాడు ఘనంగా ప్రారంభమైంది. హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో ఈ మహానాడు జరిగింది. అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించిన మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, ఇతర నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మినీ మహానాడులో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా

...(మిగతా 2లో)

# దేశంలో కరోనా డేంజర్ బెల్స్!

**కేంద్రం హెచ్చరికలు జారీ**



**దిల్లీ :** దేశంలో కరోనా(కోవిడ్19) డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 260 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా కేరళ, మహారాష్ట్ర, తమిళనాడులో అత్యధిక కేసులు గుర్తించారు. వీటిలో కొన్ని కేసులు ఒమిక్రాన్ జేఎన్.1 వేరియంట్ కు సంబంధించినవి

...(మిగతా 2లో)




# అచ్యుతాపురం కేంద్రంగా భారీ సైబర్ డెన్

**160 మంది యువతీ, యువకులతో వల**

**అనకాపల్లి, విశాఖ సమాచారం:** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం కేంద్రంగా భారీ సైబర్ డెన్ గుట్టురట్టయ్యింది. అచ్యుతాపురం శివారులో ఫేక్ కాల్ సెంటర్ ముసుగులో ఈ సైబర్ కార్యకలాపాలు

...(మిగతా 2లో)

# 50 మంది ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు యత్నం



**ఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ వేళ భారీ సంఖ్యలో ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు కుట్ర పన్నారు. ఈ ప్రయత్నాలను బీఎస్ఎఫ్ తిప్పికొట్టింది. ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకను భారత్‌లోకి పంపేందుకు పాక్ యత్నించింది. ఈ విషయాన్ని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45 నుంచి 50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా యత్నించాయి. ఇందుకోసం భారీగా షెల్లింగ్ కూడా చేపట్టినట్లు పేర్కొన్నాయి. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "మా జవాన్లు వారికి తీవ్ర స్థాయిలో నష్టం కలిగించారు. పెద్ద ఎత్తున ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు వస్తున్నట్లు మా వద్ద ముందే సమాచారం ఉంది. వారి కోసం కాచుకు కూర్చొని.. గుర్తించగానే దాడులు నిర్వహించాము. ఆ గ్రూపులో దాదాపు 45-50 మంది వరకు ఉన్నారు. వారు మా వైపునకు వచ్చారు. దీంతో అదును చూసి వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాము. మేము ఊహించినట్లే తమ పోస్టుల నుంచి వారు భారీ స్థాయిలో కాల్పులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మేము అత్యంత కచ్చితత్వంతో కాల్పులు జరిపాము. దీంతో వారు తమ పోస్టులను వదిలేసి పలాయనం చిత్తగించారు. దాదాపు గంటన్నరలోనే వారికి మేము బుద్ధి చెప్పాము. వారి బంకర్లు, ఆయుధాలను ధ్వంసం చేశాము. వారు మరోసారి వస్తే పదింతల శక్తితో తిప్పికొట్టేందుకు మా జవాన్లు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలున్నాయి. బీఎస్ఎఫ్‌లోని మహిళా జవాన్లు కూడా పురుషులతో సమానంగా శత్రువులపై పోరాడే బాధ్యతలను నిర్వహించారు. వారిని చూస్తే మాకు గర్వంగా ఉంది" అని డీఐజీ వెల్లడిరచారు. బుధవారం పూంచ్‌లోని బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్మీ, బీఎస్ఎఫ్ సిబ్బందితో ఆయన భేటీ అయ్యారు.

# విజయసాయి చంద్రబాబుకు లొంగిపోయాడు

## వైఎస్ జగన్ సంచలన ఆరోపణలు



**తాడేపల్లి, విశాఖ సమాచారం :** విజయసాయిరెడ్డి చంద్రబాబుకు లొంగిపోయాడని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్ జగన్ ఆరోపించారు. తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబుకు మేలు చేసేందుకు విజయసాయి మూడున్నర సంవత్సరాల రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకున్నాడని అన్నారు. ప్రలోభాలకు లోనయ్యాడని ఆరోపించారు. అలాంటి వ్యక్తులు ఇచ్చే స్టేట్మెంట్లకు ఏం విలువ ఉంటుందన్నారు. రాజ్ కేసిరెడ్డికి బేవరేజెస్ కార్పొరేషన్ కు ఏ సంబంధం అన్నారు. టీడీపీ ఎంపీతో కలిసి ఆయన వ్యాపారాలు చేశారని అన్నారు. కృష్ణమోహన్, ధనుంజయ్, మిథున్ రెడ్డికి ఈ లిక్కర్ కేసుకి ఏం సం బంధం అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో లాభాపేక్ష ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే మద్యం విక్రయాలను చేసిందన్నారు. కానీ చంద్రబాబు నాయుడు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో పెట్టి లిక్కర్ వ్యాపారం నడిపిస్తున్నారని అన్నారు. ఇప్పుడు బియ్యం డోర్ డెలివరీ చేయడం లేదు కానీ.. మందు డోర్ డెలివరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మా హయాంలో ఎమ్మార్పీకి మించి ఒక్క పైసా కూడా ఎక్కువ అమ్మలేదన్నారు. ఎవరి పాలసీ వల్ల లంచాలకు ఆస్కారం ఉంటుందో మీరే చెప్పాలన్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు 500 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు



**అమరావతి, విశాఖ సమాచారం:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏవియేషన్ హబ్ నిర్మాణంలో భాగంగా సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఐఏఎల్ సంస్థకు 500 ఎకరాల భూ కేటాయింపునకు రాష్ట్ర క్యాబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం విమానాశ్రయం అభివృద్ధి కోసం 1,733 ఎకరాలు, జాతీయ రహదారి నుంచి విమానాశ్రయ అనుసంధానం కోసం 92 ఎకరాల మేర ప్రతిపాదన చేశారు. విమానాశ్రయంలో కార్గో ఏరియా కోసం 83.5 ఎకరాలు, నార్త్ టెర్మినల్ భవనం కోసం 98 ఎకరాలు, ఎయిర్ పోర్టు బౌండరీ కోసం 494 ఎకరాల మేర ప్రతిపాదించారు. నివాస ప్రాంతం, ఇతర అవసరాల కోసం 201 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఏటా 36 మిలియన్ల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలుగా మూడు దశల్లో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. దీని ప్రకారం 2,703 ఎకరాలు కేటాయించాల్సి ఉన్నా.. వైసీపీ ప్రభుత్వం 2,203 ఎకరాలు మాత్రమే కేటాయించింది. ప్రస్తుతం ప్రాజెక్టు వయబిలిటీతో పాటు భవిష్యత్ అవసరాలు, సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# మావోయిస్టులు చర్చలకు సిద్ధమంటుంటే ఎన్‌కౌంటర్ ఎందుకు?



**ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం మారణకాండ**

**సూపర్ 6 అమలు చేయాలని జూన్ 2న మండల కార్యాలయాల వద్ద ధర్నా**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**విజయవాడ, విశాఖ సమాచారం:** ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం మారణకాండ చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బుధవారం జరిగిన ఎన్ కౌంటర్ కేవలం కేంద్ర ప్రభుత్వం చేసిన హత్యలే అని ఆరోపించారు. ఈ ఎన్‌కౌంటర్ పై పూర్తి స్థాయి జ్యుడిషియల్ యాంక్వైరీ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అమాయకులు అయిన గిరిజన యువకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్యతో కలిసి రామకృష్ణ గురువారం జూన్ 2న మండల కార్యాలయాల వద్ద సీపీఐ ధర్నాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఓ వైపు మావోయిస్టులు చర్చలకు సిద్ధం అంటుంటే ఎన్‌కౌంటర్ చేయడం ఏంటని రామకృష్ణ ప్రశ్నించారు. చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు 27 మంది దారుణంగా చంపబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే.. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. చాలా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ.. టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలు ఊసే లేదన్నారు. పట్టణాల్లో ఉన్న వారికి 2 సెంట్లు, గ్రామాల్లో3 సెంట్లు అన్నారు. ఈ క్రమంలో పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ 6 లో ఒక్క హామీ కూడా కరెక్ట్ గా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. రైతులను పూర్తిగా విస్మరించడం సరైన పని కాదని ఆయన తెలిపారు. రైతులు పంట వేసే దగ్గర నుంచి మార్కెట్ లో ధర లేదు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ దుయ్యబట్టారు. జూన్ 2 న సూపర్ 6 అమలు చేయాలని మండల కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామని పేర్కొన్నారు.

# ఏపీలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు

## అరేబియా సముద్రంలో అల్పపీడనం



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** ఏపీలో శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు వర్షాలు కురవనున్నట్లు వాతవరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ కొంకణ్, గోవా ఆనుకుని ఈస్ట్ అరేబియా సముద్రంపై అల్పపీడనం ఏర్పడిరది. ఈ అల్పపీడన ద్రోణి తెలంగాణ వరకు వ్యాపించింది. దాని ప్రభావంతో దాని ప్రభావంతో కోస్తాలో అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు.. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కూడా పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడన ప్రభావంతో ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు పలు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురవనున్నాయి. ఉరుములతో కూడిన జల్లులు పడే ప్రాంతంలో 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండగా.. రెండు రోజుల పాటు వాతవరణ పరిస్థితి ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. గడచిన 24 గంటల్లో.. అమరావతి 9, పొదిలి 7, మాచర్ల 6, విశాఖ, మచిలీపట్నం, జంగ మహేశ్వరపురం 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోద్కెంది. కాగా మిడిల్ ఈస్ట్ అరేబియా సముద్రం, సౌత్ కొంకణ్ తీర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం నార్త్ వైపు కదులుతూ రానున్న 36 గంటల్లో బలపడి తీవ్ర వాయుగుండంగా మారనుందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. దీని ప్రభావంతో కేరళ, కర్ణాటక, గోవాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తెలంగాణలోనూ భారీ వర్షాలు అలాగే మే 27న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం కూడా ఉన్నట్టు తెలిపింది.

# అచ్యుతాపురం కేంద్రంగా భారీ సైబర్ డెన్

(మొదటి పేజీ తరువాయి)



జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. 44 ఫ్లాట్లు అద్దెకు తీసుకుని.. గత రెండేళ్ల నుండి సైబర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. నెలకి రూ.15 నుంచి 20 కోట్ల టర్నోవర్ జరుగుతున్నట్లు పోలీసులు వెల్లడిరచారు. అమెరికా పౌరులే లక్ష్యంగా కాల్ సెంటర్ ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న 33 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబ్కె, రాజస్థానకు చెందిన ఇద్దరు ప్రధాన మేనేజర్లు నడిపిస్తున్నారు. మేఘాలయ, సిక్కిం, అస్సాం, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు ఇందులో పనిచేస్తున్నారు. అమెరికా పౌరులతో ఎలా మాట్లాడాలో రెండు వారాలు ట్రైనింగ్ ఇస్తున్నారు. అమెజాన్ ఈ మార్కెట్ పేరుతో సైబర్ కాల్స్, వాల్నట్, సూపర్ మార్కెట్ గిఫ్ట్ కూపన్ లా పేరుతో నాలుగు దశల్లో ట్రాప్ చేస్తున్నారు. 3 వందల డాలర్ల నుంచి 3,000 డాలర్ల వరకు కూపన్లు ఒక్కొక్కరికి అమ్ముతున్నారు. ఇందులో 200 నుండి 250 మంది కాల్ సెంటర్‌లో పని చేస్తున్నారు. మొదట వీరందరికీ ఉద్యోగాల పేరుతో ఎరవేస్తున్నారు. అపార్ట్‌మెంట్లకు 18 లక్షల రూపాయలు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. పోలీసులు.. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. రూ.3 లక్షల నగదు, 300కు పైగా కంప్యూటర్స్ సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని.. అపార్ట్‌మెంట్ ఓనర్లపై కూడా విచారణ జరుపుతామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

ఈ బాగోతంలో మొత్తం 160 మంది యువతీ, యువకులు ఉన్నట్లు నిర్దారణ అయింది. అపార్ట్‌మెంట్లలో పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు ఉంటున్న విషయాన్ని గతంలోనే స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. అయితే ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెతున్నాయి. ప్రస్తుతం ఈ కేసును ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సైబర్ క్రైమ్‌ల వెనుక ముంబ్కెకి చెందిన మహిళ కీలక సూత్రధారిగా ఉన్నట్లు తెలుస్తోంది. యువతీ యువకులు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులందరికి ప్రతి నెల క్యాష్ రూపంలో జీతాలు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. కీలక డేటాను సేకరించేందుకు ఐటీ, సైబర్ క్రైమ్ ఎక్స్‌పర్ట్స్ ప్రయత్నం చేస్తున్నారు.

# సాగు ప్రణాళికపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టిపెట్టాలన్నారు.

రైతుల దగ్గర ఉన్న కోకో పంట నిల్వలను కేజీ రూ.500కు కంపెనీల ద్వారా కొనుగోళ్లు జరిపేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రస్తుతం 1,200 మెట్రిక్ టన్నుల నుంచి 1500 మెట్రిక్ టన్నుల కోకో నిల్వలు ఉన్నాయని, వీటిలో 600 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతుల దగ్గర ఉన్నాయని వాటిని మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సుమారు 20,000 మిలియన్ కేజీల మేర రాష్ట్రంలో రైతుల దగ్గరున్న హెచ్డీ బర్లే పొగాకు నిల్వలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. హెచ్డీ బర్లే, వైట్ బర్లే రకాలను టొబాకో బోర్డులో చేర్చాల్సిందిగా ముఖ్యమంత్రి ఇప్పటికే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి లేఖ రాశారు. మ్యాంగో పల్ప్ జ్యూస్ వినియోగం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందించడంతో పాటు... తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ మ్యాంగో జ్యూస్ అందించే అంశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో టొమాటో ప్రాసెసింగ్ యూనిట్లు పెరిగేలా ప్రోత్సహించి.. రైతులు ఆశించిన ధర వచ్చేలా చూడాలని చెప్పారు. మరోవైపు ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్య లేదని, ఏ ప్రాంతాల్లో అయితే తడి చిన ధాన్యం ఉందో వాటిని కూడా కొనుగోలు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదండ్ల మనోహర్, గొట్టిపాటి రవి, రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదిత రులు పాల్గొన్నారు. కాగా సీఎం చంద్రబాబు గురువారం సాయంత్రం దిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర మంత్రులతో రైతుల సమస్యలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలోనే కేబినెట్ సబ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు.

# 103 అమృత్ స్టేషన్లు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. చురు-సాదుల్‌పూర్ రైలు మార్గానికి కూడా పునాది రాయి వేశారు. బహుళ విద్యుదీకరించిన రైల్వే మార్గాలను జాతికి అంకితం చేశారు. సరిహద్దు కనెక్టివిటీని పెంచడానికి అనువైన రూ. 4,850 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు.

# 'అమరావతి'కి అంత ఖర్చా

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తమ ఐదేళ్ల పాలనలో 3,32,671 లక్షల కోట్లు అప్పు చేస్తే.. చంద్రబాబు నాయుడు 12 నెలల్లోనే 1,37,546 లక్షల కోట్లు అప్పు చేశారని జగన్ చెప్పుకొచ్చారు. "మేం ఐదేళ్లలో చేసిన అప్పు.. బాబు ఏడాదిలోనే చేశారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పాడు, బాబు ఏడాది పాలనలో పెట్టుబడులు తగ్గాయి.. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. రాష్ట్ర ఖజానాకు ఆదాయం రావడంలేదు. రాష్ట్ర ఆదాయమంతా గజదొంగల జేబుల్లోకి వెళుతోంది. ఏపీఎండీసీకి గనులు తాకట్టుపెట్టి 9వేల కోట్లు అప్పు చేశారు. 293 (1) ప్రకారం బాబు అప్పులు చేసే విధానం చట్ట విరుద్ధం. ఏపీఎండీసీ భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారు. విద్యుత్ కొనుగోలులో రూ.11వేల కోట్ల స్కామ్ జరిగింది. యాక్సిస్ సంస్థ నుంచి యూనిట్ కు రూ.4.60 చొప్పున కొన్నారు. చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు దోచి పెడుతున్నారు. 4 గంటల పీక్ అవర్ కోసం అంటూ..24 గంటలకు యూనిట్ కు రూ.4.60 చొప్పున కొనుగోలు చేశారు. మా హయాంలో సెకీతో విద్యుత్ ఒప్పందం చేసుకున్నాం.. మా హయాంలో యూనిట్ కు రూ.2.49లకే విద్యుత్ కొన్నాం.. విద్యుత్ కొనుగోలులో రాష్ట్ర ఆదాయం ఆదా చేశాం. రాష్ట్రంలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అమరావతి టెండర్ల పేరుతో మరో దోపిడీకి తెర తీశారు" అని జగన్ ధ్వజమెత్తారు.

# జూన్ 4న వెన్నుపోటు దినం

(మొదటి పేజీ తరువాయి)

వెన్నుపోటు దినంగా నిర్వహిస్తామని ప్రకటించారాయన. జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా నిర్వహిస్తాం. ఆరోజున ప్రజలతో కలిసి నిరసనలు చేపడతాం. కలెక్టర్లను కలిసి హామీల డిమాండ్ పత్రాలను సమర్పిస్తాం. చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా కలిసి రావాలని కోరారాయన.

# దేశంలో కరోనా డేంజర్ బెల్స్!

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఉన్నాయి. దేశంలో పెరుగుతున్న కరోనా కేసుల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ ప్రజలకు, అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ వాడాలని, దూరం పాటించాలని ప్రజలకు సూచించింది. ఆసుపత్రుల్లో కోవిడ్ వార్డులు, టెస్టింగ్ కిట్స్, ఐసీయూ బెడ్స్, ఆక్సిజన్, వెంటిలేటర్లు సిద్ధం చేయాలని రాష్ట్రాలకు కీలక ఉత్తర్వులు విడుదల చేసింది. కాగా ఇటీవల ముంబై కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆసుపత్రిలో ఇద్దరు(59 ఏళ్ల మహిళ, 14 ఏళ్ల బాలుడు) కోవిడ్‌తో మరణించారు. దీంతో కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తం అయ్యి రాష్ట్రాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు పరిస్థితి అదుపులో ఉందని, భయపడాల్సిన అవసరం లేదని కేంద్రం తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ వో) ఈ వేరియంట్ తక్కువ ప్రమాదకరమైనదే అని, కానీ జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

# సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం పొందాయి. ఈ సందర్భంగా హొం మంత్రి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలు నాకు భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాలలో పాయకరావుపేటలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా నడుస్తున్నాయని తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. పాయకరావుపేట అంటే తెలుగుదేశం పార్టీ కంచుకోట అని చెప్పారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గంలో ఉత్తమ సేవలందించిన నాయకులను, కార్యకర్తలను సన్మానించారు.

# కొత్త రేషన్‌కార్డుకు మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారంపై ఆయన స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లికార్డు, పెళ్లి ఫొటో అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయొద్దని చెప్పారు. రేషన్‌కార్డుకు ఎవరు దరఖాస్తు చేసినా స్వీకరించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి మనోహర్ సూచించారు. 4.24 కోట్ల మందికి జూన్‌లో ఉచితంగా రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తమ వద్ద ఉందని.. అందులో ఎక్కడా లోపం లేదన్నారు. ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో ఉంటూ సాంకేతికతను ఉపయోగించుకుని ముందుకెళ్తోందని చెప్పారు. క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రైస్‌కార్డు ఇస్తామని తెలిపారు. దీనికోసం క్షేత్రస్థాయిలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా కుటుంబసభ్యులు ఎవరైనా రేషన్‌కార్డులో యాడ్ చేసుకోవచ్చని తెలిపారు. తొలగింపునకు మాత్రం మరణించిన వారి పేర్లనే ప్రస్తుతానికి పరిగణనలోకి తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. కార్డులో 'హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ' మార్చేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. నమోదైన తప్పుడు వివరాలను సరిచేసేందుకు జాయింట్ కలెక్టర్ వరకు వెళ్లకుండా తహసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పించామని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## ఆగస్ట్ 15 నుంచి 22 వరకు మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు

### జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ అభిమానుల సంఘం ఉపాధ్యక్షులు నర్సీపట్నం వాసి జాజుల రమణబాబు ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి 22వ తేదీ వరకు పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నర్సీపట్నంలో నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా వారం రోజులు పాటు రోజుకొక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, పాటల పోటీలు, డాన్స్ పోటీలు, వీర మహిళలకు సత్కారం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా నాయకులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకుడు మీసాల సత్యనారాయణ, సత్యనారాయణ మూర్తి, మామిడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేతలను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):-** పార్వతీపురంలో నిర్వహించిన అరకు పార్లమెంటు మహానాడుకు హాజరైన టిడిపి సీనియర్ నాయకులును, ఎమ్మెల్యేలును, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జులు, అధ్యక్షులను ఎమ్మెల్యే విజయచంద్ర ఘనంగా సత్కరించారు. మహానాడు కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో వేదికపై నుండి ముఖ్య నాయకులను సాధరంగా తన నివాసానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే విజయ్ చంద్రఅందరినీ శాలువాలతో సత్కరించి, తెలుగు మహిళా నేతలకు చీరలు కానుకగా ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమం తదితర అంశాలపై ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు, అధ్యక్షులు,నాయకులు చర్చించారు. అరకు పార్లమెంటు మహానాడును కనీ విని ఎరుగని రీతిలో విజయవంతంగా నిర్వహించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర ను టిడిపి నాయకులు, ఎమ్మెల్యేలు ప్రశంసలు కురిపించారు.

## జిల్లా మినీ మహానాడు లో బుచ్చయ్యపేట టీడీపీ నాయకులు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి జిల్లా పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి, కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోం విపత్తు నివారణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, మాడుగుల శాసనసభ సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, ఇతర ముఖ్య నేతలతో బుచ్చయ్యపేట మండల టీడీపీ నాయకులు గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, తామరాన దాసు, దేవర అప్పారావు లు కలిసి హాజరైరి.

## కంటిపై అశ్రద్ధ వద్దు! చేయించు పరీక్ష ముందు!



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య పరీక్షా కేంద్రాన్ని చోడవరం శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ ఆర్క్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కంటి వైద్య పరీక్ష కేంద్రాన్ని కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు రాజు తెలిపారు. ప్రస్తుత జనరేషన్లో వయస్సుతో సంబంధం లేకుండా 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే చిన్న పిల్లల దగ్గర నుంచి మొసలి వాళ్ల వరకు అనేకమంది కంటి సమస్యలతో సతమవుతున్న పరిస్థితులను మనం చూస్తున్నామన్నారు. మనిషి అవయవాల అన్నింటిలోనూ కన్ను చాలా ముఖ్యమైనదని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని ఆయన తెలిపారు. అనేకమందికి కంటి చూపు మందగించడం, మరి కొంతమందికి కంటి చూపు పోవడం, కొంతమందికి సత్వరం, అలాగే కంటికి దెబ్బలు తగలడం, కంటి ఆపరేషన్ మొదలగు వాటన్నింటికీ ఈ పరీక్ష కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నేడు కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు కంటి అద్దాలు ఉపయోగించవలసిన పరిస్థితి నెలకొంది అన్నారు. కంటి జబ్బులు రాకుండా పలు రకాల ఆకుకూరలు మొదలగునవన్నీ నేడు తినడం మానేయడం వలన, అలాగే రోడ్డు గుండా ప్రయాణం చేసేటప్పుడు కంటికి అద్దాలు ధరించకుండా వెళ్లడంతో కళ్ళలో దుమ్మి, దూలి పడగటం వలన కళ్ళకు తొందరగా జబ్బులు వచ్చే పరిస్థితి నెలకొంటుంది అన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటి బయటపడాలంటే ప్రతి ఒక్కరు బైక్ మీద ప్రయాణం చేసేటప్పుడు కంటికి అద్దాలు కానీ, హెల్మెట్ కానీ తప్పనిసరిగా వాడినట్లయితే కంటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా కొంతమేర కంటిని రక్షించుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మహాలక్ష్మి నాయుడు, గ్రామ సర్పంచ్ గెంజి గెంజి మోది నాయుడు, ఆర్కు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రసాదు, కంటి పరీక్ష కేంద్రం ప్రతినిధి ముక్కా రమేషు పలువురు పాల్గొన్నారు.

## అన్నదమ్ములు.. గూగుల్‌లో కొలువులు



అమలాపురం, : మండపేట, న్యూస్‌టుడే : సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆ అన్నదమ్ములు ఒకరి నుంచి మరొకరు స్ఫూర్తి పొందుతూ చదువులో దూసుకుపోతుంటే.. బిడ్డల కలలు నెరవేర్చేందుకు ఆ తల్లిదండ్రులు ఎంతో శ్రమించారు. వెరసి ఆ ఇద్దరూ 25 ఏళ్లలోపే ప్రతిష్ఠాత్మక గూగుల్‌లో రెండేళ్ల వ్యవధిలో భారీ ప్యాకేజీతో కొలువులు సాధించి కన్నవారి కళ్లలో వెలుగులు నింపారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామంలో సొసైటీలో చిరుద్యోగం చేసే పాలచర్ల అమ్మిరాజు, సునీత దంపతుల కుమారులు శ్రీవినోద్, శ్రీసత్య నవీన్. వీరిద్దరూ ఉన్నత కొలువులు సాధించాలన్న లక్ష్యం నిర్దేశించుకొని ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగారు.

**చిన్నప్పటి నుంచీ గణితంపై మక్కువ**

జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని చిన్నప్పటి నుంచి కలలు కన్న ఆ అన్నదమ్ములను తల్లిదండ్రులు ప్రోత్సహించారు. పెద్దకుమారుడు శ్రీవినోద్ గూగుల్ సంస్థలో ఏడాదికి రూ.50 లక్షల ప్యాకేజీకి 2023లో ఎంపికవగా.. అన్నను స్ఫూర్తిగా తీసుకున్న శ్రీసత్యనవీన్ తాజాగా అదే సంస్థలో రూ.44 లక్షల ప్యాకేజీతో ఎంపికవడం విశేషం. జేఈఈ మెయిన్స్‌లో 1924వ ర్యాంకు సాధించిన నవీన్ వరంగల్ నిట్‌లో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) 2021లో చేరారు. సాంకేతిక సృజనకు పదునుపెడుతూ.. ఏటా ఆ విభాగంలో టాపర్‌గా రాణించారు. నాలుగో ఏడాది నిట్ క్యాంపస్ సీఎస్ విభాగం నుంచి 900 మందిలో అత్యుత్తమ ప్రతిభ చూపి బంగారు పతకం అందుకున్నారు. ప్రాంగణ ఎంపికలో గూగుల్ సంస్థకు ఏడాదికి రూ.44 లక్షల ప్యాకేజీకి ఎంపికవ్వగా.. వచ్చే నెలలో కొలువులో చేరేందుకు సత్య నవీన్ సిద్ధమవుతున్నారు.

**కోడింగ్‌పై పట్టు సాధించా...**

ప్రతిష్ఠాత్మక సంస్థల్లో కొలువులు సాధించాలంటే కోడింగ్‌పై పట్టు, వేగం అవసరం. నేను లీట్‌కోడ్, గీక్స్‌ఫర్‌గీక్స్ వెబ్‌సైట్స్‌లో అభ్యాసన చేయడం వల్ల కోడింగ్‌పై పట్టు సాధించా. అన్నయ్య అప్పటికే గూగుల్‌లో పని చేస్తున్నందున సందేహాలను నివృత్తి చేసకుంటూ ముందుకుసాగాను.. అయిదు రౌండ్లలో జరిగిన ముఖాముఖిలో అన్ని విభాగాల్లో ప్రతిభ చూపడంతో క్యాంపస్ నుంచి ఆ సమయంలో అయిదుగురు ఎంపికవ్వగా.. రాష్ట్రం నుంచి నేనొక్కడినే ఉన్నా. చిన్నప్పటి నుంచి అమ్మ మాపై ఎంతో శ్రద్ధ చూపించడంతోపాటు, చదువులో రాణించేందుకు రోజూవారీ ప్రణాళికలు రూపొందించేవారు. చదువు, ఆటల్లో మా ఇష్టాలను ప్రోత్సహిస్తూ.. లక్ష్యాలను గుర్తు చేస్తూ గూగుల్ సంస్థ వైపు నడిపించారు. అమ్మానాన్నలను జీవితాతం ఏ లోటూ లేకుండా చూసుకోవడమే మా ఇద్దరి లక్ష్యం.

## నీటి సరఫరా విభాగపు అధికారులతో మేయర్ సమీక్ష



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం మే 22: విశాఖ లో గల నీటి రిజర్వాయర్లను నిత్యం సందర్శించి సంబంధిత నీటి పంప్ హౌస్ లను, నీటి నాణ్యతను తనిఖీలు నిర్వహిస్తూ శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించేలా నీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో ప్రజలకు అందించే తాగునీటిని ఎప్పటికప్పుడు వాటి నాణ్యతను నిత్యం పరీక్షలు నిర్వహించి సరఫరా చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ కి తాగునీరు అందించే ప్రధాన వనరులైన ఏలేరు, తాటిపూడి, రైవాడ, గోస్తని, ముడసర్లోవ, మేఘాద్రి గెడ్డ, శారదా రివర్ నుండి నగర ప్రజలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఎంత నీరు సరఫరా అవుతుందని, వాటి నిర్వహణ ఖర్చు పై ఆరా తీశారు. నగరంలో ప్రజలకు నీరు సరఫరా చేసే పంపు హౌస్ లు, వాటర్ ట్యాంకులు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ లు ఎన్ని ఉన్నాయని, వాటి నిర్వహణకు సంబంధించిన విద్యుత్ బిల్లులు, ఎంతమంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిసున్నారని మొదలైన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలామంది అధికారులు రిజర్వాయర్లను, పంపు హౌస్ లను తనిఖీలు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధుల్లో అలసత్వం వహించరాదని, భాధ్యతతో అధికారులు ప్రతి రిజర్వాయర్లను, పంపు హౌస్ లను స్వయంగా ఎప్పటికప్పుడు సందర్శించాలని ఆదేశించారు.

పలువురు అధికారులు మేయర్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాచారం అందించలేనందున, వారు నిర్వహిస్తున్న ప్రాజెక్టులపై అవగాహనారాహిత్యం కనిపిస్తుందని వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూర్తి సమాచారం తో తర్వాత సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు కె.శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, సుధాకర్, శ్రీనివాస్ ప్రసాద్, ఉపకార్య నిర్వహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు.. అప్పుల సామ్రాట్: వైఎస్ జగన్



**గుంటూరు:** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి మోసాలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మీడియా సమావేశంలో ఎండగట్టారు. బుధవారం తాడేపల్లిలో వైఎస్ జగన్ కూటమి ఏడాది పాలనలో చంద్రబాబు సర్కార్ చేసిన అప్పులను లెక్కలతో సహా వివరించారు.

"ఈ 12 నెలల కాలంలోనే.. చంద్రబాబు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశారు. ఈ ఏడాది కేంద్రంలో 13.76 శాతం పెరుగుదల కనిపిస్తే.. రాష్ట్ర రెవెన్యూ 3.8 శాతం మాత్రమే. చంద్రబాబు అప్పుల సామ్రాట్. మా ఐదేళ్ల పాలనలో 3,32,671 లక్షల కోట్లు అప్పు చేస్తే.. బాబు 12 నెలల్లోనే 1,37,546 లక్షల కోట్ల అప్పు చేశారు. మేం ఐదేళ్లలో చేసిన అప్పు.. చంద్రబాబు ఏడాదిలోనే చేశారు. అప్పులు తేవడంలోనూ చంద్రబాబు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారు" అని వైఎస్ జగన్ అన్నారు.

ఏపీఎండీసీకి గనులు తాకట్టుపెట్టి 9 వేలకోట్లు అప్పు చేశారు. 293(1) ప్రకారం బాబు అప్పులు చేసే విధానం చట్ట విరుద్ధం. ఏపీఎండీసీ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. రాష్ట్ర గనులపై ప్రైవేట్ వ్యక్తులు అజమాయిషి ఇస్తున్నారు" అని వైఎస్ జగన్ అన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో పిఎండిఎస్ విధానం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** మండలంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గురువారం వెంకుపాలెం యూనిట్ లో వెంకుపాలెం ఆర్ఎస్కె లో పీఎండిఎస్ కిట్స్ తయారు చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో పిఎండిఎస్ విధానంలో 30 రకాల విత్తనాలు ఎకరాకు 12 కేజీలుగా తయారు చేసి రైతులకు అందజేస్తారు. రైతులు ఎకరాకి 12 కేజీలు చొప్పున వేసుకున్నట్లయితే భూసారం పెరుగుతుందని వివరించడం జరిగింది. ఈ విధంగా ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూసారాన్ని పెంచుకుంటూ ఎరువులు వాడకాన్ని తగ్గించవచ్చునని నాణ్యమైన పంటలను పండించడం ద్వారా ఆరోగ్యానికి కాపాడుకోవచ్చని మోహన్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు లెక్కల దీపిక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పంచముఖి ఆంజనేయ ద్వితీయ వార్షికోత్సవం



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రమైన జి మాడుగుల గాంధీనగరం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ద్వితీయ వార్షికోత్సవం లు గురువారం నాడు ఘనంగా ప్రారంభ మయ్యాయి. గురువారం తెల్లవారుజామున సాయిరాం గురుస్వామి ఆధ్వర్యంలో 108 కలశాలతో పాలాభిషేకం జలాభిషేకంచేసి అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు భారీ స్థాయిలో స్వామివారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. భజన కార్యక్రమం నిర్వహించారు. .. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఘనంగా హనుమాన్ జయంతి. జి మదుగుల మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనముగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు భక్తులు తరలివె ళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆంజనేయ స్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

## ఘనంగా జరిగిన ప్రపంచ తేనెటీగల దినోత్సవం




**విజయవాడ, (పీఐబీ):-** ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ , రాష్ట్ర కార్యాలయం, విజయవాడ వారి ఆధ్వర్యంలో ప్రపంచ తేనెటీగల దినోత్సవం వేడుకలు 20 మే 2025 తేదీన ఆంధ్రా ప్రదేశ్ షెడ్యూల్ కుల సంక్షేమ సంఘం , డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ భవనం, అరండల్ పేట, విజయవాడ నందు నిర్వహించారు.

ముంబాయి లోని అటవీ ఆధారిత పరిశ్రమ డైరెక్టరేట్ ఆదేశాలకు అనుగుణంగా ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్, రాష్ట్ర కార్యాలయం, విజయవాడ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినారు.

ఈ కార్యక్రమంలో తేనెటీగల పెంపకం దారులు, పిఎంఇజిపి లబ్ధిదారులు, మహిళలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. గ్రిప్, డైరెక్టర్, ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్, రాష్ట్ర కార్యాలయం, విజయవాడ.

ఎన్. రవికుమార్, FA& CAO, APKVIB, అమరావతి.

డి. నూర్ మొహమ్మద్, అసిస్టెంట్ డైరెక్టర్, -1, SO, కెవిఐసి, విజయవాడ.

ఆనందకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, APKVIB, విజయవాడ.

పి. పరమేశ్వర రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి, విజయవాడ.

ఆర్. ఎల్. ఎన్. మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్-II, SO, కెవిఐసి, విజయవాడ.

టి. వి. రావు, ఎగ్జిక్యూటివ్ (V.I), SO, కెవిఐసి, విజయవాడ.

వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని సహజ ఆహార అభివృద్ధిలో తేనెటీగల పాత్ర, ప్రాముఖ్యత , తేనెటీగల రక్షణ మరియు వివిధ పథకాల క్రింద ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్ అందిస్తున్న సాంకేతిక మరియు ఆర్థిక సహాయం గురించి వివరించుట జరిగినది. అదేవిధంగా తేనెటీగల పెంపకం కొరకు ఇస్తున్న ప్రోత్సాహకాలు, రైతులు, లబ్ధిదారులు, వినియోగించుకొని తేనెటీగల పెంపకం ప్రోత్సహించాలని కోరారు.

టి. వి. రావు, ఎస్.బి.ఇ.సి., కెవిఐసి, విజయరాయి, ఏలూరు జిల్లా వారు, ఎస్.బి.ఇ.సి. కార్యకలాపాలు ,శిక్షణ సౌకర్యాలు మరియు తేనె వెలికితీత మొదలగు వాటిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చినారు.

పి. పరమేశ్వర రెడ్డి , ఉద్యానవన శాఖ అధికారి , కృష్ణా జిల్లాలో తేనెటీగల పరిశ్రమకు ఉద్యానవన శాఖ అందిస్తున్న మద్దతును వివరించారు.

ఎ. ఆనంద్, అసిస్టెంట్ డైరెక్టర్, APKVIB స్థానిక రైతులకు తేనెటీగల పెంపకం పరిశ్రమ అమలు మరియు పిఎంఇజిపి పథకం క్రింద ఆర్థిక సహాయం పొందడం గురించి వివరించారు.

ఎన్ రవి. కుమార్ , FA & CAO, APKVIB, అమరావతి మాట్లాడుతూ వ్యవసాయం మరియు మానవుల ప్రయోజనాల కోసం ప్రకృతిలో తేనెటీగల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా తేనె ఉత్పత్తి ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.

డాక్టర్ ఎస్. గ్రిప్, డైరెక్టర్, కెవిఐసి, రాష్ట్ర కార్యాలయం, విజయవాడ వారు, ప్రపంచ తేనెటీగల దినోత్సవం యొక్క లక్ష్యం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తేనెటీగల పెంపకం పురోగతి గురించి వివరించారు. అదేవిధంగా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బీ కీపింగ్ ఎక్స్టెన్షన్ సెంటర్, కెవిఐసి, విజయరాయి వారు తేనెటీగల పెంపకం ఉపకరణాలు మరియు వివిధ తేనెటీగల ఉత్పత్తులపై ప్రదర్శన ఏర్పాటు చేసియున్నారు. ఈ ప్రదర్శనలో సుమారు 140 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పిఎంఇజిపి లబ్ధిదారుడు సరఫరా చేసిన (200 గ్రాముల) తేనె సీసాలు పంపిణీ చేయుట జరిగినది.

ఆర్. ఎల్. మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్-II / V.I ధన్యవాదాలతో సమావేశం ముగిసినది.

## జీ తెలుగు అప్సర అవార్డ్స్, 20 సంవత్సరాల వేడుక

### ఈ శనివారం సాయంత్రం 5:30 గంటలకు!




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రారంభించిన రోజునుంచీ ప్రతిభావంతులైన కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు, చిత్రబృందం అచంచలమైన అంకితభావంతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతూ తిరుగులేని ఛానల్గా ఎదిగింది జీ తెలుగు. మే 18, 2025కి విజయవంతంగా ఇరవై సంవత్సరాల మైలురాయిని చేరుకున్న సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలకు ప్రతిష్ఠాత్మక జీ తెలుగు అప్సర అవార్డులను ప్రదానం చేసింది. వెండితెర, బుల్లితెర తారల సందడితో వైభవంగా జరిగిన జీ తెలుగు అప్సర అవార్డ్స్ ఈ శనివారం, మే 24, 2025 సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారం కానుంది!

అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, రవి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో డ్రామా జూనియర్స్ పిల్లలు చిరంజీవి, బాలకృష్ణ గెటప్‌లో వేదికపైకి వచ్చి ప్రముఖ నటి రోజాకు అవార్డు అందించారు. జయప్రద, ఐశ్వర్య రాజేష్, అనిల్ రావిపూడితో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాలోని సీన్ని రీక్రియేట్ చేశారు. అమల అక్కినేని రవి, రోజాతో కలిసి డాన్స్ చేయడమే కాకుండా, జంతు సంరక్షణ, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. జయసుధకు అభిమానులు ఆటోగ్రాఫ్‌లతో అలంకరించిన చీరను బహుమతిగా ఇచ్చారు.

విశాఖ సమాచారమ్
శుక్రవారం 23-5-2025

## ఉగ్రవాద వ్యతిరేక పోరులో భారత్‌కు మద్దతు ఏదీ?

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరులో భారత్‌కు అంతర్జాతీయంగా ఎందుకు మద్దతు లభించలేదు? పహల్గాం ఉగ్రదాడి తర్వాత వచ్చిన సింపతీ అతి తక్కువ సమయంలోనే ఎందుకు సన్నగిల్లింది? పాక్‌కు చైనా, టర్కీ, అజర్‌బైజాన్‌లు తోడుగా నిలిచినట్టు.. కీలకమైన ఆ నాలుగు రోజుల పాటు ఏ దేశమూ మనకు ఎందుకు మద్దతుగా నిలవలేదు? అణ్వాయుధాలతో పాక్ బెదిరింపులకు దిగినప్పటికీ ఐఎంఎఫ్ మరోసారి బిలియన్ డాలర్ల రుణం ఎందుకు ప్రకటించింది? ఇలాంటి ప్రశ్నలెన్నో ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్పన్నమవుతున్నాయి. మే 13న కరణ్‌థాపర్‌తో జరిగిన ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరి చెప్పినట్టుగా.. అంతర్జాతీయంగా మన విశ్వసనీయతను భారతీయ మీడియా తీవ్రంగా దెబ్బతీసింది. తత్ఫలితంగా అంతర్జాతీయంగా జరిగిన అభిప్రాయ యుద్ధం (పర్సెప్షన్ వార్)లో మనం ఓడిపోయాం. అరుణ్ శౌరి అభిప్రాయపడినట్టు.. ఓ వర్గం మీడియా (ప్రత్యేకించి న్యూస్ చానళ్లు) 'ఒక దేశానికి వ్యతిరేకంగా నేరం' అన్నట్టుగా రిపోర్టింగ్ చేశాయి. ఉగ్రవాదులు, పాక్, ముస్లింలను ఒకే గాటన కట్టి నాలుగైదు చానళ్లు వాస్తవాన్ని వక్రీకరించి కథనాలను వండివార్చాయి. తద్వారా దేశంలోని రెండు అతిపెద్ద సమాజాల మధ్య సంఘర్షణను మరింతగా పెంచాయి.

ఆయా చానళ్ల యాంకర్లు ఉపయోగించిన భాష కూడా అసభ్యకరంగా ఉంది. ఓ చానల్‌లో ఒక వీడియో క్లిప్ ప్రసారమైంది. అందులో తనను తాను రిటైర్డ్ మేజర్‌గా చెప్పుకొన్న ఓ వ్యక్తి.. మన దేశానికి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఓ ఇస్లామిక్ దేశ విదేశాంగ మంత్రిని తీవ్ర పదజాలంతో దూషించారు. ఆయన వాడిన అభ్యంతరకరమైన మాటను సదరు టీవీ స్క్రీన్‌పై చాలాసేపు చూపించారు. ఇది ముమ్మాటికీ విదేశాలతో శత్రుత్వాన్ని సృష్టించడమే. తీవ్ర నేరం కూడా. కానీ, ఆ యాంకర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని పర్యవసానంగా రెండుమూడు రోజుల తర్వాత సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ లాంటి దేశాలు పాక్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరుకు మద్దతిచ్చాయి.

యుద్ధ సమయంలో మీడియా అన్ని పరిమితులను దాటివేసింది. యుద్ధ రిపోర్టింగ్ అబద్ధాలు, యుద్ధోన్మాదంతో నిండిపోయింది. టీవీ చానళ్ల స్టూడియోలు తప్పుడు కథనాల వార్ రూమ్‌లుగా మారిపోయాయి. కల్పిత కథనాలను మీడియా ప్రసారం చేశాయి. గంటగంటకూ తప్పుడు కథనాలను ప్రసారం చేసి గందరగోళం, భయాందోళనలు సృష్టించాయి. వాస్తవాలను ప్రసారం చేసి దేశంలో నెలకొన్న పరిస్థితులను చల్లార్చకుండా.. శాంతి ఒప్పందం జరిగిన వారం తర్వాత కూడా యుద్ధోన్మాదాన్ని కొనసాగించాయి.

భారత్‌కు దౌత్యపరంగా ఇబ్బందులు ఎదురవడానికి, అంతర్జాతీయంగా ఒంటరిగా మారడానికి విదేశాంగ శాఖ మంత్రిగా జైశంకర్ విఫలమవడమే ప్రధాన కారణం. అతని దూకుడు, మన కంటే ఉన్నత స్థాయిలోని దేశాలతో మాట్లాడే విధానం, విశ్వగురు ఆశయాలు అంతర్జాతీయ అంశాల్లో మన స్థాయికి సరిపోలవని గుర్తించేందుకు నిరాకరించడం, ప్రజాస్వామ్యాన్ని గుర్తించడంలో అసమర్థత, అవకాశవాదం కలగలిసి.. ప్రపంచ దేశాలు మన రాజకీయాలను, మన విధానాలను అనుమానించడానికి, మన నుంచి దూరం కావడానికి దారితీశాయి. మన పొరుగు దేశాల్లోనూ మనకు మిత్రులు లేరని పాకిస్థాన్ యుద్ధం స్పష్టం చేసింది.

ప్రపంచం ఇలాంటి ఘటనలను గమనించి భారతదేశం నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదం అనే ప్రధాన కారణం వెనక్కి వెళ్లిపోయి.. హిందూ భారత్ వర్సెస్ ఇస్లామిక్ పాకిస్థాన్ అనే నెరేటివ్ తెరపైకి వచ్చింది. రాజకీయ, మీడియా వైఫల్యాల వల్ల యుద్ధభూమిలో మన సైనికులు సాధించిన విజయాలు వృథా అయ్యాయి. అవకాశవాదం, మానవ హక్కుల అణచివేత, విద్వేషం, మత జాతీయవాదంలో కూరుకుపోయిన దేశం.. నైతికంగా ఉన్నత స్థానాన్ని, అంతర్జాతీయ మద్దతును ఆశించడం కుదరదు. దీని కోసం కాదు మన సైనికులు పోరాడిరది. మన సైనికులు గెలిచారు, భవిష్యత్తులో తమపై ఉగ్రదాడి జరిగితే భారీ మూల్యం చెల్లించేలా చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని మన దళాలు నిరూపించాయి. కానీ ఒక దేశంగా మనం వారిని తీవ్రంగా నిరాశపరిచాం.

## 'అంబ పలుకు' .. ఒక నిశ్శబ్ద గళానికి నినాదం







ప్రముఖ కవి పి. శ్రీనివాస్ గౌడ్ రాసిన "అంబ పలుకు" కవితా సంపుటి, ఆధునిక దళిత సాహిత్యంలో ఒక నిశ్శబ్ద గళాన్ని నినాదంగా మార్చిన అరుదైన కవితా ప్రకటన. ఇది ఒక పుస్తకం కాదు ౼ ఒక విప్లవపు పలుకు, ఒక గోడల్లేని గది నుంచి వినిపిస్తున్న ఉద్యమ స్వరం.

ఈ సంపుటి అంబేద్కర్ తత్వాన్ని కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దానిని జీవితాల పునరావిష్కరణగా, ప్రతిఘటనా వేదికగా నిలబెడుతుంది. "అంబ" అనే పదం ౼ అంబేద్కర్‌ను, "పలుకు" ౼ ఆత్మపలుకుబడిని సూచిస్తూ, ఈ పేరు అంతరార్థాలతో నిండిన శబ్దశిల్పంగా మారింది.

"ప్రాసెస్ – అను ఒక అనుక్రమము"

కవితలోని పురుగు, ఊసరవెల్లి, పొడపాము, పాములు, బుట్టఇవి సహజ జీవచక్రంలోని పాత్రలు మాత్రమే కాదు. ఇవి సామాజిక పటంలో మనిషి స్థితిని ప్రతిబింబించే బలమైన ప్రతీకలు.

"బుర్రలో ఒక పురుగు" అంటే ఆలోచన మొదలయ్యే చోట.

ఇది సందేహం కావచ్చు, సందేహంలోంచి పుట్టిన జ్ఞానం కావచ్చు.

"ఊసరవెల్లి" – "పొడపాము" – "పాములు"

ఈ క్రమం మన భయాల, ఆకాంక్షల, ఎదురుచూపుల, అణచివేతల చుట్టూ ఉన్న పావురంగా కనిపిస్తుంది.

ఇది ప్రాసెస్ ప్రతి జీవనం ఎదో ఒక దానికోసం ఎదురు చూస్తూ ఉండే సైక్లికల్ బంధనం.

"పాములు పట్టేవాడు వచ్చి పాములు పట్టి వెళ్లిపోయాడు"

ఈ పంక్తి నాటకీయంగా పరిస్థితిని తార్కిక ముగింపు

వ్యవస్థ, పరిపాలన, రాజకీయ చర్యలు ౼ ఇవన్నీ భయాలను తీర్చవు, వాటిని గుళ్ళలో బంధిస్తాయి అని చెబుతుంది.

"బుట్టలో నాకు ఊపిరాటం లేదు"

ఇది ఈ కవిత యొక్క గుండె. అంతా సమీకరించినా, తాను ఊపిరి లేని స్థితిలోనే మిగిలిపోతాడు కవి.

ఇది ఒక శ్వాసలేని దశ ౼ చదివే మనిషికి బాధను కలిగించే నిర్ఘాత స్థితి.

"నీటి తంబూర"

ఈ కవిత ఒక మాతృభూమి–మాతృత్వం–జల సంస్కృతి మధ్య సంక్లిష్టమైన అనుభూతుల స్వరూపం.

"దేశదిమ్మరిని మీటిన నీటి తంబూర" అనే ప్రథమ పాదమే కవిత సారాంశానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇది జల సంస్కృతిని సంగీతాత్మకంగా ఊహించి, దేశపు మృదుత్వాన్ని పలికించుతోంది.

మాతృత్వపు జ్ఞాపకాలు, బతుకుబండిలో కొట్టుకుంటున్న తలవంపులు, తిరుగులేని కాలసంచారంలో మిగిలే ముద్రలుఅన్నీ ఒక పదార్థశూన్యత, కానీ భావపూర్ణత మధ్య నడిచే ప్రయాణంగా కవితను తీర్చిదిద్దారు

"నగరం వడదెబ్బకు వడలి గుయ్యమంటున్న గువ్వలో గలగల నీళ్లు"

"వజ్రాలు తాపడం చేసిన వెన్నెల జలతారు"

"బ్రహ్మతీరిని గాలిపక్షనే తరతరాల కాలాలలో ఇక్కడే గిరి గిరి కీ లు కొట్టుతుంటా"

ఇటువంటి పదాలన్నీ ఊహాత్మకతను కళాత్మకతగా మార్చిన రూపకాలు. వాక్య నిర్మాణంలో కొన్నిచోట్ల భావగంభీరత అధికంగా ఉండడం వల్ల పఠనం కొద్దిగా కష్టతరం అనిపించింది కానీ ఇది శైలీశక్తికి నిదర్శనంగా కూడా నిలుస్తుంది.

ఈ కవిత భావప్రబంధ కవిత్వంలో ఒక గొప్ప ఉదాహరణ. సమకాలీన జలవనరుల సమస్యలను, మాతృత్వపు జ్ఞాపకాలను, గ్రామీణ–నగర జీవన విరుద్ధతలను కలగలిపి ఒక మార్మిక గాథగా నెరిపిన కవిత ఇది. ఇది కేవలం కవిత కాదు, ఒక జల మానవ చరిత్ర.

అదేవిధంగా నా సమాధి దగ్గర నిలబడి ఏడవద్దు

అనే కవిత చూసుకుంటే ఈ కవితని మేరీ ఎలిజిబెత్ ఫ్రై అనే అమెరికన్ కవయిత్రి రాసింది. దానిని శ్రీనివాస్ గౌడ్ గారు తెలుగులోకి అనువాదం చేశారు.

ఈ కవిత ఒక దార్శనికతతో కూడిన జీవితానంతర ఆత్మకథనం.

"నా సమాధి దగ్గర నిలబడి ఏడవద్దు"

ఈ కవిత ఒక పునరుక్తి ఒక నిర్ధైర్యాన్ని, ఆత్మనిరాశ్రయ స్థితిని సూచిస్తుంది.

జీవితం నశించదని, అది ప్రకృతిలో మార్మికంగా విలీనమవుతుందని కవిత తెలియజేస్తుంది. %–% గాలిగా, వజ్రంగా, వానగా, మిస్సడిగా, పక్షుల కళకలాలుగా, తారకాగా... ఇలా ప్రతి వస్తువులో , ప్రకృతిలో నేను అంటూ ఉన్నాను అని చెబుతూ

చివరికి నేను మరణించలేదు అంటుంది.

"నేను..." అనే పదప్రారంభ పునరావృతం వల్ల కవిత భావాత్మకంగా గాఢంగా మారింది.

ఈ కవిత "గోడల్లేని గది" ఒక అత్యంత గాఢమైన, ప్రతీకాత్మక, రాజకీయ–సామాజిక దృక్కోణాన్ని కలిగిన ఆధునిక నిషేధగీతం. ఇది కేవలం గదిపై గీతం కాదు ఇది చింతన, వ్యక్తిత్వం, స్వేచ్ఛ, మరియు సమాజపు విపరిణామాలపై కవి గదిలోంచి వినిపించిన నిరాకరణ ధ్వని.

ఈ కవిత మూడు భాగాలుగా విభజించబడింది

మొదటి భాగం వ్యక్తిగత గదిగా అభివర్ణించారు. నిశ్శబ్దంగా మానసిక ఉన్మాదం వైపు కదలుతున్న

"గదిలో ఆలోచనల ఆత్మహత్యలు"

"గదిలో కలలు కనుమూయడం" వంటి పదాలు, మానసిక శోషణ, దురవస్థను వ్యక్తీకరిస్తున్నాయి.

రెండవ భాగంలో భావోద్వేగాత్మక, జ్ఞాపకాలతో నిండిన ఉషస్సు గది అంటూ

ఇది మాతృత్వాన్ని, సృష్టిని, ఊహలను, భావజాలాన్ని గదిగా చూపించారు.

చివరి భాగం అదే గది రాజకీయ దుర్వినియోగంతో మార్చబడిన శూన్యంగా వర్ణించాడు కవి.

"గద్ద తిరుగుతోంది", "నల్లకోటు మొరుగుతోంది", "చట్టరచన జరుగుతోంది" అన్నవి ప్రతిపత్తి అధికారాల దాడిని సూచించే పదబంధాలు.

"గది ప్రశ్నకు పునాది కావడం", "గదిని దేశద్రోహి కొక్కెను చేయడం" వంటి పంక్తులు అభివ్యక్తి స్వేచ్ఛపై పెరుగుతున్న దౌర్జన్యాన్ని ప్రగల్భంగా వెలిబుచ్చుతాయి.

మొత్తం మీద చూసుకుంటే

"అంబ పలుకు" ఒక కవి గళం మాత్రమే కాదుబీ ఒక తరం శ్వాస, ఒక వర్గం విశ్వాసం, ఒక ఉద్యమపు ప్రతిధ్వని.

ఈ కవిత సంపుటిలో కవితలు అన్నీ బాగున్నాయి. ఒక గాయం, నది మూలం, కాళిదాసు మరియు చంద్రుడు , రుధిర పదాలు

వంటి విదేశీ కవులు / కవయిత్రిలు రాసినవి అనువాదం చేశారు.

అందరూ తప్పక చదవలసిన పుస్తకం.

ఇది చదివిన వారు ప్రశ్నించకుండా ఉండరు. దళిత సాహిత్యానికి ఇది ఒక శిలా లేఖనం.

ప్రముఖ కవి శ్రీనివాస్ గౌడ్ గారి కలం నుంచి మరెన్నో కవితా సంపుటాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి శుభాభినందనలు.

**జ్యోతి ముప్వల, 9008083344**

## బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు

### చిరస్మరణీయులు



"బావా బావా పన్నీరు" తెలుగు లోగిళ్లలో పండుగకు వచ్చిన కొత్త అల్లుళ్లను మరదళ్లు సరదాగా ఆటపట్టిస్తూ పాడేపాట. తెలుగునాట ప్రసిద్ధి పొందిన ఈ జానపదం రాసినది అడవి బాపిరాజు. ఈ పాట ఆడపడుచుల,బావమరుదుల నోటపలికినప్పుడల్లా "బాపి బావ" గుర్తుకు వస్తారు." ఉప్పొంగి పోయింది గోదావరి,తాను తిప్పున్న ముగిసింది,కొండల్లు ఉరికింది,కోనల్లు నిండింది,ఆకాశగంగ తో హస్తాలు కలిపింది" అని గోదావరిని తన కవిత్వంతో పరవళ్లు తొక్కించినది బాపిరాజు. అలాగే "పూవుల తేనెవై,బావిలో మత్తువై,పాటలో ఫణితివై,మాటలో తేటవై" తన ఉహా సుందరి శశికళ ను పరవశించేలా వర్ణించిన బాపిరాజు కవిత్వం అజరామరం.

అడవి బాపిరాజు స్వాతంత్ర్య సమర యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత, కళాకారుడు,నాటకకర్త. చిన్నతనం నుంచి సాహిత్యం అంటే ఇష్టం. అన్నిటికంటే ఆయన రచయితగా, చిత్రకారుడిగా ప్రసిద్ధుడైనాడు. స్వాతంత్ర్య యోధుడిగా 1922లో సంవత్సరం పాటు జైలుకెళ్లినప్పుడు తొలి నవల 'హిమబిందు' రచించారు. బందరు జాతీయ కళాశాలలో చటర్జీ వద్ద చిత్రలేఖనం నేర్చుకున్నాడు. భీమవరంలో న్యాయవాదిగా చేస్తూ 'నారాయణరావు' అనే నవల రాసారు. ఈనవలకు ఆంధ్రవిశ్వకళాపరిషత్ బహుమతి లభించింది. 1934–39 వరకూ బందరుజాతీయకళాశాల ప్రధానాచార్యుడిగా పనిచేసారు. 1939లో సినీ ప్రవేశం చేసి అనసూయ,మీరాబాయి,ధ్రువ విజయం వంటి సినిమాలకు కళా దర్శకత్వం వహించాడు. 1944–47వరకూ మీజాన్ పత్రికకు హైదరాబాద్లో సంపాదకుడిగా పనిచేసారు. ఆ సమయంలోనే ప్రముఖ నవలులుగా ప్రసిద్ధిచెందిన "గోనగన్నారెడి కోరంగి,తుఫాను "నవలలు రచించారు.


బాపిరాజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 1895 అక్టోబర్ 8న కృష్ణయ్య,సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య భీమవరంలో,రాజమండ్రిలోబీఏ చదివి,మద్రాస్ లా కాలేజీలో బిఎల్ పూర్తి చేసారు. కొన్నాళ్లు న్యాయవాది వృత్తి చేపట్టారు. తరువాత బహుముఖ ప్రజ్ఞాశాలి కావడంతో ఇతర వ్యాసంగాలపై దృష్టి సారించారు. చిత్రకళ నేర్పడానికి గుంటూరులో ఫౌండేషన్ ప్రారంభించారు.

చిన్ననాటి నుంచి కవితలు రాసేవారు. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి "కిన్నెరసాని" కి బాపిరాజు చిత్రాలు వేయడం విశేషం. ఆయన చిత్రాల్లో సముద్ర గుప్తుడు,తిక్కన ప్రసిద్ధమైనవి. ప్రముఖ సాహిత్య పత్రిక భారతి ముఖ చిత్రంగా బాపిరాజు వేసిన చిత్రం రావడం విశేషం. ఆయన వేసిన" శబ్ద బ్రహ్మ " చిత్రం డెన్మార్క్ మ్యూజియంలో ఉంది. భాగవత పురుషుడు, ఆనందతాండవం చిత్రాలు తిరువాన్కూరు ప్రదర్శన శాలలో ఉన్నాయి. శ్రీలంకలో ఆయన కుడ్య చిత్రాలు భద్రపరిచారు. ఆయన ఇతర నవలలు అడవి శాంతిశ్రీ, అంశుమతి,నరుడు,జాజిమల్లి తదితరులు ఉన్నాయి. ఆయన అనేక రెడియో నాటకాలు రాసారు. ఏరువాక, నవోదయం, శైలబాల,ఉషా సుందరి,దుక్కిటెద్దులు తదితరాలు రాసారు. కథల సంపుటాలు అంజలి, తరంగిణి, వింధ్యాచలం వంటివి ప్రసిద్ధమైనవి. కథలు నాగలి,నేల తల్లి, బొమ్మలరాణి తదితరాలు రచించారు. 1952 సెప్టెంబర్ 22న ఈ బహుముఖ కోవిదుడు కన్నుమూసారు. ఆయన కథలు, గేయాలు అనేక భాషల్లోకి అనువాదం అయ్యాయి. ఆయన విగ్రహాన్ని విశాఖలో నెలకొల్పారు. ఆయన నవలలు నారాయణరావు, గోనగన్నారెడ్డి, చిత్రాలు, కథా సంపుటాలు ఆయనను చిరస్మరణీయులు గా చేసాయి.

విశ్వనాథసత్యనారాయణ బాపిరాజు గూర్చి "అతడు గీసిన గీతబొమ్మై –అతడు పలికిన పలుకు పాటై ,అతని హృదయంలోని మెత్తన – అర్థవంత్కృతియై, అతడు చూసిన చూపు మెరుపై– అతడు తలచిన తలుపు వెలుగై,అతని జీవితంలోని తియ్యన –అమృతరస ధునియై" చెప్పడం ఆయన బహుముఖం వ్యక్తమయింది. స్వాతంత్ర్య సమరంలో ఉద్యమ కారులను ఉత్సాహ పరుస్తూ ఆనేక గీతాలు రాసారు.

మహాత్ముని గూర్చి"హిమాలయోత్తంగ శృంగం.. నీ బ్రతుకు ఉమాపతి నాట్యరంగం " అంటూ స్వయంగా బాపిరాజు పాడుతుంటే తాము పరవశించేవారమని దాశరథి కృష్ణమాచార్య చెప్పిన మాటలు ఆయన ప్రతిభ కు తార్కాణం.

**యం.వి.రామారావు,8074129668**



## అశాశ్వతమే!

ఈ జీవితం
శాశ్వతం కాదని
ఎలా నిర్ధారణకొచ్చావనేగా
నీ ప్రశ్న

నువ్వు నాకు
శాశ్వతం కాదు

నేను నీకు
శాశ్వతం కాదు

దీనిని
ప్రాతిపదికగా
చేసుకునే చెప్తున్నా
జీవితమూ శాశ్వతం కాదని

శాశ్వతం
అనుకున్నవన్నీ
అశాశ్వతమే అని
నీకింకా ఎలా
చెప్పాలంటావు?
– జయా

## మరుగున పడుతున్న కొన్ని తెలుగు సామెతలు

84. గంతకు తగ్గ బొంత
85. గతి లేనమ్మకు గంజే పానకం
86 గోరు చుట్టు మీద రోకలి పోటు
87. గొంతెమ్మ కోరికలు
88. గుడ్డి కన్నా మెల్ల మేలు
89. గుడ్డి యెద్దు చేలో పడినట్లు
90. గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్లు
91. గుడినే మింగే వాడికి లింగమొక లెఖా?
92. గుడిని గుడిలో లింగాన్నీ మింగినట్లు
93. గుడ్ల మీద కోడిపెట్ట వలే
94. గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకొన్నాడట
95. గుర్రము గుడ్డిదైనా దానాలో తక్కువ లేదు
96. గురువుకు పంగనామాలు పెట్టినట్లు
97. తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు
98. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు
99. ఇంటి పేరు కస్తూరివారు వీధిలో గబ్బిలాల కంపు
100. ఇంటికన్న గుడి పదిలం
101. ఇసుక తక్కెడ పేడ తక్కెడ
102. జోగి జోగి రాసుకుంటే బూడిద రాలిందంట
103. కాచిన చెట్టుకే రాళ్ళ దెబ్బలు
104. కాగల కార్యము గంధర్వులే తీర్చినట్లు
105. కాకి ముక్కుకు దొండ పండు
106. కాకి పిల్ల కాకికి ముద్దు
107. కాలం కలిసి రాక పోతే కర్రే పామై కాటు వేస్తుంది
108. కాలు జారితే తీసుకోగలము కాని నోరు జారితే తీసుకోగలమా
109. కాసుంటే మార్గముంటుంది
110. కడుపు చించుకుంటే కాళ్ళపైన పడ్డట్లు
111. కలకాలపు దొంగ ఏదో ఒకనాడు దొరుకును
112. కలి మి లేములు కావడి కుండలు
113. కలిసి వచ్చే కాలం వస్తే, నడిచి వచ్చే కొడుకు పుడతాడు
114. కంచే చేను మేసినట్లు
115. కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా !
116. కందకు కత్తి పీట లోకువ
117. కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం
118. కీడెంచి మేలెంచమన్నారు
119. కొండ నాలికకి మందు వేస్తే ఉన్న నాలిక ఊడినట్లు
120. కొండల్లే వచ్చిన ఆపద కూడా మంచువలే కరిగినట్లు
121. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు
122. కొన్న దగ్గర కొసరే గాని కోరిన దగ్గర కొసరా
123. కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెరిచిందిట
124. కూటికి పేదైతే కులానికి పేదా
125. కొరివితో తల గోక్కున్నట్లే
126. కోతికి కొబ్బరి చిప్ప ఇచ్చినట్లు
127. కొత్తొక వింత పాతొక రోత
128. కోటి విద్యలు కూటి కొరకే
129. కొత్త అప్పుకు పోతే పాత అప్పు బయటపడ్డదట
130. కొత్త బిచ్చగాడు పొద్దు యెరగడు
131. కృషితో నాస్తి దుర్భిక్షం
132. క్షేత్ర మెరిగి విత్తనము పాత్ర మెరిగి దానము
133. కుడుము చేతికిస్తే పండగ అనేవాడు
134. కుక్క వస్తే రాయి దొరకదు రాయి దొరికితే కుక్క రాదు
135. ఉన్న లోభి కంటే లేని దాత నయం
136. లోగుట్టు పెరుమాళ్ళకెరుక
137. మెరిసేదంతా బంగారం కాదు
138. మంచమున్నంత వరకు కాళ్ళు చాచుకో
139. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది
140. మంది యెక్కువయితే మజ్జిగ పలచన అయినట్లు
141. మనిషి మర్మము.. మాను చేవ... బయటకు తెలియవు
142. మనిషి పేద అయితే మాటకు పేదా
143. మనిషికి మాటే అలంకారం
144. మనిషికొక మాట పశువుకొక దెబ్బ
145. మనిషికొక తెగులు మహిలో వేమా అన్నారు
146. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా
147. మీ బోడి సంపాదనకుఇద్దరు పెళ్ళాలా
148. మెత్తగా ఉంటే మొత్త బుద్ధి అయ్యిందట
149. మొక్కై వంగనిది మానై వంగునా

## చరిత్రలో ఈ రోజు (మే 23)

**సంఘటనలు:**

1984: బచేంద్రీపాల్, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి భారత పర్వతారోహకురాలు

2009: ఐపిఎల్–2 విజేతగా హైదరాబాద్ దక్కన్ చార్జర్స్ నిలిచింది.

**జననాలు:**

1942: కె. రాఘవేంద్రరావు, శతాధిక చిత్రాల తెలుగు సినిమా దర్శకుడు.

1944: ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, రచయిత, ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అసిస్టెంట్ ఎడిటర్

1942: చంద్ర మోహన్, తెలుగు సినీ నటుడు

1954: వాసిరెడ్డి నవీన్, సాహితీకారుడు.

1961: ప్రభ, తెలుగు చలన చిత్ర నటి, కూచిపూడి నర్తకి.

1965: వై.వి.యస్.చౌదరి, తెలుగు సినిమా దర్శకుడు

1971: ఐశ్వర్య, దక్షిణ భారత చలన చిత్ర నటి

1989: పూర్ణ, భారతీయ సినీ నటీ, మోడల్.

**దినోత్సవం:**

ప్రపంచ తాబేలు దినోత్సవం

## పంచాంగం

శుక్రవారం 23-5-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. ఏకాదశి రా. 10.30 |
| నక్షత్రం | : ఉత్తరాభాద్ర సా. 4.02 |
| వర్జ్యం | : రా. 2.55 ల 4.22 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

## బ్రెయిన్ స్టోక్ వల్ల అనారోగ్యం పాలైన వైసీపీ కార్యకర్త బొర్రా సూరిబాబుకు పెద్దేవం గ్రామ కమిటీ ఆర్థిక సాయం



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి కొల్లి చినబాబు):** తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో 5వ వార్డు కి చెందిన వైసీపీ కార్యకర్త బొర్రా సూరిబాబు బ్రెయిన్ స్ట్రోక్ వల్ల అనారోగ్యం పాలైన సందర్భంగా కొవ్వూరు నియోజవర్గ ఇన్చార్జ్ తలారి వెంకటరావు,, వైఎస్ఆర్సీపీ పార్టీ తూర్పు గోదావరి జిల్లా మాజీ ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ ల చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు 45,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు,ఎంపీపీ జొన్న కూటి పోసిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు బట్టు సుబ్బారావు , జిల్లా యాక్టివేట్ సెక్రెటరీ వంబోలు పోసిబాబు, వైఎస్ఆర్సీపీ నాయకులు నల్లాకుల వేణుగోపాలకృష్ణ, మైలవరపు రాధాకృష్ణ,కోడి గంగారావు,చింతా వెంకటస్వామి, నామన వీర వెంకటరావు,వేణు రామారావు, యండపల్లి వీర వెంకట సత్యనారాయణ, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు కవల నాగేశ్వరావు,యండపల్లి కృష్ణార్జునులు, పాల్గొన్నారు.

## కొవ్వూరులో యోగాంధ్ర-2025 ప్రారంభం



**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్ రిపోర్టర్ మెరిపో నాని) :** యోగా కాంపెయిన్‌లో ప్రతీ ఒక్కరూ పాల్గొని ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రోత్సహించాలవి కొవ్వూరు ఎంఎల్ఏ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు . కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు , మున్సిపల్ సిబ్బంది అందరితో కలిసి ప్రజలకు యోగాలో అవగాహన కల్పిస్తామన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.

## పరవాడలో ఘనంగా శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రమైన పరవాడలో శ్రీశ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సినిమా హాల్ జంక్షన్, సబ్ స్టేషన్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హెూమాలు, అభిషేకాలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు జరిపించారు. వైకాపా రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు సబ్ స్టేషన్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద స్వామివారి దర్శనం చేసుకుని ఆలయ వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధన ప్రారంభించారు. సుమారు 2500 మంది భక్తులు ఈ అన్న సమారాధనలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## వేసవి అవసరాలకు తెలుగు రాష్ట్రాలకు నీరు విడుదల

**విజయవాడ:** ఏపీకి 4, తెలంగాణకు 10.26 టీఎంసీలు కేటాయింపు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆదేశాలు జారీ శ్రీశైలం, సాగర్‌లో నీటి వినియోగానికి నిర్దిష్ట స్థాయిలు వేసవి దృష్ట్యా పెరుగుతున్న నీటి అవసరాలను పరిగణలోకి తీసుకుని, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కృష్ణా జలాలను విడుదల చేయడానికి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వేసవి తాగునీటి అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు 4 టీఎంసీలు, తెలంగాణ రాష్ట్రానికి 10.26 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు కేఆర్ఎంబీ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నీటి వినియోగానికి సంబంధించి ప్రాజెక్టులలో నీటిమట్టాలపై కూడా బోర్డు స్పష్టతనిచ్చింది. శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల వరకు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 505 అడుగుల వరకు నీటిని వాడుకోవడానికి అనుమతించింది.

ఆంధ్రప్రదేశ్ అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నీటి విడుదలతో వేసవిలో తాగునీటి సమస్య కొంతమేర తీరుతుందని భావిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ విషయంలో కూడా బోర్డు కీలకమైన సూచన చేసింది. జులై నెలాఖరు వరకు శ్రీశైలం జలాశయంలో కనీసం 800 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగించాలని తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా తెలిపింది. ఈ నిర్ణయాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బోర్డు వర్గాలు వెల్లడించాయి.

# ప్రకృతి విధ్వంసంతో మానవజాతి మనుగడకు ముప్పు



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):-** 'ప్రకృతిని పరిరక్షించుకుంటేనే మనం ఉంటాం. చెట్లు తొలగించడం కాదు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతి నుంచి తీసుకోవడం కాదు. ఇవ్వడానికి అలవాటుపడాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. నేటి సమాజంలో ప్రకృతి నుంచి తీసుకోవడమే కానీ ఇవ్వడం అలవాటు లేకుండా పోయిందని అన్నారు. ప్రకృతిని రక్షించుకుంటే.. ప్రకృతి మనల్ని రక్షిస్తుందని తెలిపారు. మన రాష్ట్రంలోనూ అటవీ భూములు ఆక్రమించుకునే వారు ఉన్నారు... కొత్తగా అడవులు సృష్టించాలన్న ఆలోచన ఉన్నవారు కరవయ్యారన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు మన ఇంటి నుంచే మొదటి అడుగు వేయాలని కోరారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తరఫున ప్రతి జిల్లాలో ఒక బయో డైవర్సిటీ పార్కు, ప్రతి గ్రామంలో ఒక పల్లెవనం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "పర్యావరణం అంటే కేవలం మొక్కలకు సంబంధించిన విషయం కాదు. అది మన జీవన శైలి. ప్రకృతిని పరిరక్షించుకుంటేనే పర్యావరణ సమతౌల్యం సాధ్యపడుతుంది. ప్రకృతి పరిరక్షణకు మనం ఏమైనా చేయాలి అనుకుంటే ముందుగా ఉన్నదాన్ని చెడగొట్టకుండా ఉంటే చాలు. నా వరకూ నేను 8 ఎకరాల పొలంలో దున్నడం మానేసి అక్కడ సహజంగా మొక్కలు పెరిగే ఏర్పాటు చేశాను. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు నా వంతు నేను కృషి చేయాలన్న ఆలోచనతోనే అలా చేశాను. సహజంగా పెరిగిన మొక్కలు మనకి అవసరం లేకపోవచ్చు. కానీ అవి జీవ వైవిధ్యానికి తోడ్పడతాయి. ప్రతి ఒక్కరు మన పెరట్లో జీవ వైవిధ్యం పెంచేందుకు చేయగలిగింది చేసి తోడ్పడాలి. మన అవసరాల కోసం చెట్లు కొట్టేస్తున్నాం. తిరిగి నాటడం లేదు. మన సంస్కృతి చెప్పే వసుధైక కుటుంబం ప్రతి జీవికి బతికే హక్కు కల్పిస్తుంది.

మన పండుగలు, సంస్కృతి ప్రకృతిలోని జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకుంటేనే మనం బతికి ఉంటామని చెబుతాయి. వినాయక చవితి పూజకి 54 రకాల ఔషధ మొక్కలు వినియోగించాలని పెద్దలు చెబుతారు. వనజీవి రామయ్య గారు లక్షల సంఖ్యలో చెట్లు పెంచారు. జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవడానికి మన వంతు మనం చిన్న చిన్న పనులు చేస్తే చాలు. నా వ్యవసాయ క్షేత్రంలో చిన్న చిన్న కుంటలు తవ్వితే అది కుందేళ్లు, నెమళ్లకు ఆవాసంగా మారింది. ప్రకృతి పరిరక్షణకు మన ఇంట్లో, మన పెరట్లో ఏం చేయగలం అనే ఆలోచన ప్రతి ఒక్కరు చేయాలి.

**మనల్ని రక్షించే మడ అడవుల్ని నాశనం చేసేస్తున్నారు**

పర్యావరణ పరిరక్షణకు చట్టాలు ఎన్ని తీసుకువచ్చినా మనం వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోకపోతే ఉపయోగం ఉండదు. జీవ వైవిధ్యం పెంచడానికి ఎవరికి వారు మన వంతు మనం ఏమి చేయగలం అన్న ఆలోచన చేయాలి. ఈ భూమి మన ఒక్కరి కోసమే సృష్టించింది కాదు. సమస్త జీవరాశులకు ఇది ఆలవాలం. నా మటుకు నాకు ఒక చిన్న మొక్క నాటడం గొప్ప పనిగా భావిస్తాను. భార్య ఉదయం క్యారియర్ కట్టి ఇచ్చి పంపితే వనజీవి శ్రీ రామయ్య గారు తన జీవితకాలంలో లక్షల సంఖ్యలో మొక్కలు నాటారు. ఇక్కడున్న ఓ స్కూల్ టీచర్ మొక్కలు కాపాడుదాం అంటూ బోర్డులు తగిలించుకుని తిరుగుతున్నారు. ప్రకృతి మీద ఎంతో ప్రేమ ఉంటేనే అది చేయగలం.

సీడ్ బాల్స్ తయారు చేసి విసరడం ద్వారా వేల సంఖ్యలో మొక్కలు నాటే వీలు ఉంటుంది. ఇప్పుడున్న నాయకులు భూమి కనిపిస్తే ఆక్రమించేస్తున్నారు. నా మటుకు నాకు ఖాళీ భూమి కనిపిస్తే జీవ వైవిధ్యం సృష్టించాలనిపిస్తుంది. తీర ప్రాంతాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన మడ అడవులు సముద్రం దగ్గర ఉంటూ మనల్ని రక్షిస్తాయి. సునామీలు, తుఫాను లాంటి విపత్తులు సంభవించినప్పుడు అడ్డుగోడగా నిలుస్తాయి. ఇటీవల ఆ మడ అడవులను నాశనం చేసేస్తున్నారు.

**అడవులు విధ్వంసం జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది**

ప్రకృతి విధ్వంసం ప్రమాదకరం. దాన్ని సరిదిద్దుకోకపోతే సమస్త మానవ జాతి నష్టపోతుంది. మొక్కలు నాటితే దాన్ని ఆధారంగా చేసుకుని ఎన్నో జీవులు వస్తాయి. మనతో పాటు సమస్త జీవరాశులు బతకాలన్నదే జీవ వైవిధ్యం తాలూకు సారాంశం. చదువు మనకు విజ్ఞానంతోపాటు అహంకారాన్ని ఇచ్చింది. ప్రకృతి పట్ల నిర్లక్ష్యం పెంచింది. తెలిసో తెలియకో అది ప్రకృతి విధ్వంసానికి కారణం అయ్యింది. జీవ వైవిధ్యాన్ని పెంచడం మనందరం బాధ్యతగా స్వీకరించాలి. ఈ విషయంలో ఒక వ్యక్తినో, పార్టీనో నిందించలేము. వసుధైక కుటుంబం అంటే అందులో ప్రతి చెట్టు, పక్షి, జంతువు, నదులు, సముద్రాలు, భూములు అన్నీ ఉంటాయి. అడవుల్ని పరిరక్షించే చెంచులు దాన్ని బాగా అర్థం చేసుకున్నారు. అభివృద్ధిలో భాగంగా ఒక చెట్టు నరకాలి అన్న ఆలోచన వస్తే దానికంటే ముందు పది చెట్లు నాటాలి. అప్పుడే జీవ వైవిధ్యం దెబ్బ తినకుండా ఉంటుంది. మన పూర్వీకులు చెట్లను పూజించేవారు.

సనాతనధర్మం అంటే మతోన్మాదం కాదు.. ప్రకృతిలో మమేకమయ్యే జీవన విధానం. జంతుజాలం మన అన్నదమ్ములు. పక్షులు మా అక్క చెల్లెళ్ళు, కొండలు మా పూర్వీకులు అని చెబుతుంది. అభివృద్ధి ముసుగులో వీటిని మనం కోల్పోతున్నాం. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత. మనిషి చేసే విధ్వంసం ఊహించని స్థాయిలో ఉంది. మన జ్ఞానం మనల్ని మనం మర్చిపోయేలా చేయకూడదు. మన మూలాలు ఏంటి అనేది తెలుసుకోవాలి. చిన్న మార్పు చాలా పెద్ద విధ్వంసానికి దారి తీస్తుంది. ప్రకృతిపై మనిషి చేసే యుద్ధం ఏ స్థాయిలో ఉందో తెలుసు. ఒక నియంత్రణ లేకుండా అడవులను నాశనం చేస్తున్నారు. అది మానవ వినాశనానికి హేతువు.

**పక్షి కూడా వాలని చెట్లు ఎందుకు?**

ఒక్క పక్షి కూడా నివాసం ఉండని యూకలిప్టస్, కోనోకార్పస్ వంటి మొక్కల నాటుతున్నాం. అవి ప్రాణవాయువును అతి తక్కువ మోతాదులో అందిస్తాయి. మన రావి చెట్టు 85 శాతం ఆక్సిజన్ వదులుతుంది. నర్సరీల యజమానులు కోనో కార్పస్ చెట్లను ఉంచమని అడుగుతున్నారు. అది రాష్ట్రానికి తీవ్ర నష్టం చేస్తుంది. కడియం నర్సరీలు కోనో కార్పస్ మొక్కల అమ్మకాలు నిలిపివేసే అంశంపై ఆలోచన చేయాలి. పక్షులు కూడా వాలని మొక్కలు ఎలా అమ్ముతారు? నర్సరీలలో పెంచేప్పుడు సాధ్యమైనంత వరకు అటవీశాఖ మార్గదర్శకాలు పాటించాలి. అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ఒక బయో డైవర్సిటీ పార్కు, ప్రతి గ్రామంలో ఒక పల్లెవనం ఏర్పాటు చేస్తాం. పక్షులు, తేనె టీగలకు ఆశ్రయం కల్పించే మొక్కలు అందులో నాటుతాం. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలి" అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ శ్రీ నీలాయపాలెం విజయకుమార్, ఏపీటీఎస్ ఛైర్మన్ మోహన్ కృష్ణ, బోర్డు మెంబర్ సెక్రెటరీ రామకృష్ణ, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, ఏపీ ఎఫ్.డి.సి. ఎండీ శ్రీ ఆర్.పి.ఖజురియా తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల పక్షాన పోరాటం



**దేవరపల్లి:** పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే వరకు రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గోపాలపురంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కూసం రామ్మోహన్‌రెడ్డి ఇంటి వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. పొగాకు రైతుల కష్టాలు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ రైతుల పక్షాన పోరాడు తుందన్నారు. 2021 పంట సీజన్‌లో కరోనా సమయంలో పొగాకు మార్కెట్ సం క్షోభం లో ఉండగా, అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.200 కోట్లు విడుదల చేసి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. పంటల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతు పండించిన పంటలకు మద్దతు ధర ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుం దన్నారు. 2024-25 పంట కాలంలో రైతులు సుమారు 75 మిలియన్ల కిలోల పొగాకు పండించగా, ఇప్పటి వరకు కేవలం 12 మిలియన్ల కిలోలు కొనుగోలు జరిగిం దన్నారు. గత ఏడాది కిలోకు రూ. 410 లభించగా, ఈ ఏడాది రూ రైతులు పండిం చిన పొగాకును రాష్ట్ర ప్రభుత్వం తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అప్పులు రోజురోజుకు పెరిగిపోతు న్నాయని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటికి రాష్ట్రంలో అప్పులు రూ.1.40 లక్షల కోట్లు కాగా, కూటమి ప్రభుత్వం 11 నెలల పాలనలో 1.59 కోట్లు అప్పు చేసిందన్నారు. ఇంటింటికీ రేషన్ వాహనాల రద్దు దారుణ మని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత లక్షల మంది వలం టీర్లను, 16 వేల మంది మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న నిరుద్యోగులను, మరొక 16 వేల మంది రేషన్ వాహనదారులను తొలగించిందని మండిపడ్డారు. మాజీ హెూంమంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, అమలాపురం పార్ల మెంట్ నియోజకవర్గ పరిశీలకులు జక్కం పూడి విజయలక్ష్మి, రాజ మహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, రైతు విభాగం అధ్యక్షుడు వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

# శ్రీకాకుళం టు సుప్రీం కమాండర్

**శ్రీకాకుళం, పలాస:** నలభై ఏళ్ల కిందట ఓ విద్యార్థి అకస్మాత్తుగా ఇంటికి వచ్చి.. తన వాటా ఆస్తి రాసిచ్చేయాలని టీచరైన తండ్రిని కోరారు. ఎందుకని అడిగితే ఆస్తి ఇస్తే.. పేదలకు పంచేస్తా అని చెప్పారు. ఆ విద్యార్థే నంబాళ్ల కేశవరావు. విద్యార్థిగా ఊరి నుంచి, కు టుంబం నుంచి వెళ్లిన కేశవరావు విగతజీవిగా మా రారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అజ్ఞాత వాసం చేసి అడవిలోనూ ఊపిరి వదిలేశారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు చనిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో సిక్కోలు ఉలిక్కి పడింది. నంబాళ్ల స్వగ్రామమైన కోట'మ్మాళి మండలం జియ్యన్నపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చిన్నప్పుడు తెలివైన విద్యార్థి, మెరుగైన కబడ్డీ ప్లేయర్‌గా మన్ననలు అందుకున్న కేశవరావు కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామానికి చెందిన నంబాళ్ల వాసుదేవరావు (ఉపాధ్యాయుడు) లక్ష్మీనారాయణమ్మ దంపతులకు 1955లో జన్మించారు. 1 నుంచి 5 వరకు స్వగ్రామమైన జియ్యన్నపేటలో ప్రాథమిక విద్యనభ్యసించారు. ఆ తర్వాత 6 నుంచి 10 వరకు టెక్కలి మండలం తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్‌లో విద్యనభ్యసించారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసి 1971 లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ కోర్సులో చేరారు. ఏడాది తర్వాత వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరారు. ఆ తర్వాత అక్కడే ఎంటెక్‌లో చేరారు. అటు నుంచి అటే అడవి బాట పట్టారు. కేశవరావు మరణంతో కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ గ్రామం ప్రస్తుతం గుంభనంగా ఉంది. గతంలో ఒకటి రెండు మార్లు కేశవరావుమృతి వదంతులపై కొందరు స్పందించడంతో వారిని పోలీసులు విచారించారు. దీంతో ప్రస్తుతం ఎవరూ బయట పడడం లేదు.

**ఉద్దానంలో..**

నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారన్న వార్త ఉద్దానంలో దావానలంలా వ్యాపించింది. టెక్కలికి చెందిన ఆయనకు ఈ ప్రాంతం ఉద్యమాలతో నేరుగా సంబంధం లేకపోయినా ఈ ప్రాంతం మావోయిస్టు కేడరుకు, నాటి పీపుల్స్ వార్ పార్టీ కేడరుకు దిశానిర్దేశం చేసిన వ్యక్తి కావడంతో మృతి వార్తతో ఉద్దానం ఉలిక్కిపడింది. పోలీసు వర్గాలు ముందుగా పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి ఈ సమాచారం అందించి మృతదేహాన్ని తీసుకొని రావడానికి ఎవరైనా వెళ్తున్నారా అని అడిగారు. తమ గ్రామానితో ఎలాంటి బంధుత్వం లేదని, రాజకీయ బంధుత్వం మాత్రమే ఉందని వారు చెప్పారు. ఒక నాటి పీపుల్స్ వార్‌లో, నేటి మావోయిస్టు పార్టీలో పనిచేసి ఈ ఉద్దానం ప్రాంతంలో సుమారు 60మంది వరకు కార్యకర్తలు, నాయకులు పోలీసు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. నంబాళ్ల కేశవరావు మృతితో ఇక నాయకత్వ స్థానాల్లో ఈ జిల్లా నుంచి ఎవరూ లేరనే తెలుస్తోంది. ఆయన మృతదేహం తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, మాజీ మావోయిస్టు నాయకులు బయల్దేరి వెళు తున్నట్టు ఉద్దానం వాసులు చెబుతున్నారు.

**ఎన్‌కౌంటర్‌కు ఖండన**

చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ మఢ్ అడవుల్లో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌ను సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఖండించారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు కోరినా వాటిని తిరస్కరించి మన దేశపౌరులైన మావోయిస్టులను ఉగ్రవాదులపై దాడుల కన్నా ఎక్కువగా దాడి చేసి దండకారణ్యంలో ఒక భయంకరమైన వాతావరణాన్ని సృష్టించడం అప్రజాస్వామికమని, పౌర సమాజం వీటిపై తీవ్రంగా స్పందించాలని కోరారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ - సోషల్ స్టడీస్ (మెథడాలజీ)

### ప్రపంచాన్ని తరగతి గదిలోకి తెచ్చే సాధనాలు!

సాంఘికశాస్త్ర బోధనలో ఉపాధ్యాయుడికి ఉపయోగపడే ఏ వస్తువునైనా బోధనోపకరణం అనవచ్చు.

**నిర్వచనాలు:**

దేని వల్లనైతే అభ్యసనా ప్రక్రియ జరుగుతుందో లేదా ప్రోత్సహిస్తుందో దాన్ని దృశ్యశ్రవణ ఉపకరణం అంటారు. – డిక్షనరీ ఆఫ్ ఎడ్యుకేషన్.

ప్రేరణ, వర్గీకరణ ఉద్దీపన అనే అభ్యసనా ముక్కోణ ప్రక్రియ పూర్తయ్యేందుకు సహాయపడే ఉపకరణాలు దృశ్య శ్రవణోపకరణాలు – సి.వి.గుడ్

**అవశ్యకత, ప్రాముఖ్యత:**

1) ఇవి విద్యార్థుల్లో పరిశీలనాశక్తిని పెంపొందిస్తాయి.
2) జ్ఞానాన్ని స్థిరీకరించడానికి ఉపయోగపడతాయి.
3) పాఠ్యవిషయాన్ని ఆసక్తికరం చేస్తాయి.
4) విద్యార్థుల్లో విసుగును తొలగిస్తాయి.
5) ప్రపంచాన్ని తరగతి గదిలోకి తీసుకొస్తాయి.
6) అభ్యసనం శాశ్వతంగా ఉండేలా చేస్తాయి.
7) శాస్త్రీయదృక్పథాన్ని పెంపొందిస్తాయి.
8) బోధనాభ్యాసాన్ని సులభతరం చేస్తాయి.

అభ్యసన ఉపకరణాలు-ప్రాముఖ్యత: ఒకసారి కళ్లతో చూసిన దానికి వందసార్లు విన్న దాని కంటే విలువ ఎక్కువ – వెస్లీ.

వెబర్ ప్రకారం అభ్యసన అనుభవాలు: చూడడం ద్వారా 40%, వినడం ద్వారా 25%, స్పర్శ ద్వారా 17%, రుచి, వాసన 3%, ఇతర జ్ఞానేంద్రియాలు 15%.

కొబన్ ప్రకారం అభ్యసన అనుభవాలు: చూడడం 83%, వినడం 11%, వాసన 3.5%, స్పర్శ 1.5%, రుచి 1 %.

బోధన అభ్యసన ఉపకరణాలు-వర్గీకరణ: దీనిని 3 రకాలుగా వర్గీకరించవచ్చు

1) దృశ్య ఉపకరణాలు – చార్టు, మ్యాప్, గ్రాఫ్‌లు, పోస్టర్లు, ఫ్లాష్ కార్డులు, కార్టూన్, కామిక్స్, ఫొటోలు.
2) శ్రవణ ఉపకరణాలు – రేడియో, టేప్‌రికార్డర్, గ్రామఫోన్.
3) దృశ్యశ్రవణ ఉపకరణాలు – నాటకాలు, వీడియోలు, టెలివిజన్, చలనచిత్రాలు, కంప్యూటర్.

బోధనోపకరణాలు – వర్గీకరణ:

1) ప్రక్షేపక సాధనాలు: ప్రొజెక్టరు ద్వారా ప్రదర్శించేవి. ఉదా: ఫిల్మ్, ఫిల్మ్ స్ట్రిప్, స్లైడ్‌లు, ఒ.హెచ్.పి, ఎపిడయోస్కోప్.
2) అప్రక్షేపక సాధనాలు: ప్రొజెక్టరు లేకుండా చూడగలిగేవి. వీటిని దృశ్యసాధనాలు అంటారు.

ఇవి మూడు రకాలు:

ఎ) గ్రాఫిక్ ఉపకరణాలు: పటాలు, పోస్టర్లు, కార్టూన్, ఫొటోలు.
బి) త్రిమితీయ ఉపకరణాలు: స్పెసిమన్లు, నమూనాలు, తోలుబొమ్మలు, డయోరమా.
సి) ప్రదర్శన ఉపకరణాలు: నల్లబల్ల, బులెటిన్ బోర్డు, ఫ్లానెల్ బోర్డు, మాగ్నటిక్ బోర్డు, మార్కర్ బోర్డు మొదలైనవి.

ప్రయోజనాలు:

1) ప్రత్యక్ష అనుభవం కలిగిస్తాయి. 2) సమయం ఆదా. 3) శాశ్వత అభ్యసనం. 4) అమూర్త భావనలను అవగాహన కలిగిస్తాయి. 5) విసుగును పోగొడతాయి.

**అభ్యసన అనుభవాలు – వర్గీకరణ:**

1) ప్రత్యక్ష అనుభవాలు: స్వయంగా పరిశీలించి నేర్చుకునేవి.
ఉదా: సామాజిక సర్వేలు, నమూనాల తయారీ, పటాలు గీయడం, క్షేత్ర పర్యటనలు.
2) కల్పిత/ప్రతినిధిత్వ అనుభవాలు: నమూనాలు ఉపయోగించడం వల్ల కలిగే అనుభవాలు.
3) పరోక్ష అనుభవాలు: వినడం, చదవడం, చర్చించడం ద్వారా పొందే అనుభవాలు.
ఉదా: రేడియో, టీవీ, పుస్తకాలు, పత్రికలు చదవడం, పెయింటింగ్స్ ద్వారా కలిగే అనుభవాలు.

అభ్యసన అనుభవ మూలాధారాలు:

1) గృహం 2) సమాజం 3) పాఠశాల 4) సమ వయస్కుల బృందం

ఎడ్గార్‌డేల్ అనుభవాల శంఖువు: అనుభవాలను శంఖువు రూపంలో నిర్మించారు. అనుభవ శంఖువులోని అనుభవాలు కింద నుంచి పైకి వెళ్లే కొద్దీ మూర్త అనుభవాల నుంచి అమూర్త అనుభవాలుగా ఉంటాయి.

బోధనాభ్యసన ఉపకరణాలు – రకాలు:

పటం: మ్యాప్ అనే పదం మాప్ప అనే లాటిన్ పదం నుంచి ఉద్భవించింది. దీని అర్థం చదునైన ప్రదేశం. పటం రెండు రకాలు..

1) చదును పటాలు: ఎత్తుపల్లాల స్పష్టత లేని పటాలు
ఎ) భౌగోళిక పటాలు: నైసర్గిక స్వరూపాన్ని, స్వాభావిక మండలాలను చూపిస్తాయి.
బి) రాజకీయ పటాలు: సరిహద్దులను, రోడ్లు, రైలు, జల, వాయు మార్గాలను చూపిస్తాయి.
సి) ప్రత్యేక ప్రయోజనాలు ఉన్న పటాలు: జనాభా, వర్షపాతం, ఖనిజాలు వంటి పాఠ్యాంశాలను బోధిస్తాయి.
2) త్రిమితీయ పటాలు: ఎత్తుపల్లాల స్పష్టత ఉన్న పటాలు. ఇవి చెక్కతో గాని, మట్టితో గాని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేస్తారు. ఇవి త్రిమితీయ.

## సంపూర్ణ అక్షరాస్యత సాధించిన మిజోరం

దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా మిజోరం రికార్డు సృష్టించింది. ఈ మేరకు మిజోరం యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ రాష్ట్ర సీఎం లాల్దుహెూమా కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌధరి సమక్షంలో ఈ విషయాన్ని ప్రకటించారు.

**'అన్నమిత్ర' యాప్ ప్రారంభం**

ప్రజా పంపిణీ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి 2025, మే 20న "డిపో దర్పణ్" పోర్టల్‌తో పాటు "అన్నమిత్ర", "అన్న సహాయత" అనే యాప్‌లను ప్రారంభించారు.

'అన్నమిత్ర' మొబైల్ యాప్ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని లబ్ధిదారులకు చేరుస్తుందగా.. 'అన్న సహాయతా' యాప్ ఫిర్యాదుల నమోదుకు ఉపయోగపడుతుందని ఆహార శాఖ తెలియజేసింది.

ఆహార ధాన్య డిపోల ఉద్యోగులు క్రమ పద్ధతిలో తమ కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు, స్వయంగా తమ పనితీరును అంచనా వేసుకునేందుకు వీలుగా "డిపో దర్పణ్" పోర్టల్ రూపొందించారు.

**యూపీఎస్ పింఛను గణనకు కాలిక్యులేటర్**

ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ విరమణ అనంతరం ఎంత పింఛను వస్తుందో తెలుసుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది.

– డా.పి.వి.రామ్, ఎం.ఎ, బి.ఈడి, పి.హెచ్.డి
విశాఖ సమాచారమ్ 9553574250

2nd pages1111.qxd 5/22/2025 9:35 PM Page 6



# అరకువేలిలో భారీ వర్షం



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** అరకులలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది సుమారు రెండు గంటలసేపు కుండ పోత వర్షం పడింది దీంతో ప్రజలు చల్లని వాతావరణాన్ని ఆహ్వానిస్తూ ఆనందం వ్యక్తం చేశారు రోడ్లపై నీరు నిండి ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొన్న చల్లని వాతావరణాన్ని ఎంతో ఆనందంగా ఆహ్వానించారు ఈ నెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయి అనుకోవడంతో వేడి కూడా ఎక్కువగా ఉంటుంది అనుకున్నారు కానీ ఈ సంవత్సరం ఋతుపవనాలు తొందరగా వచ్చి వాతావరణాన్ని చల్లదనం చేయడం పట్ల ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు ఈ మధ్యకాలంలో పడిన వర్షాలు కంటే ఈరోజు పడే వర్షం చాలా ఎక్కువగా పడింది అని వారు వాపోతున్నారు దీంతో ఈ సంవత్సరం వేసవికాలం మొత్తం పూర్తయినట్లుగా భావిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు

# ఎంజిఎన్ఆర్జిఎస్ రివ్యూ సమావేశం



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంజి ఎన్ఆర్ఆ జిఎస్ రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి రోజు కూడా కాంపొనెంట్ ఫారమ్ పాండ్స్ కమ్యూనిటీ సోక్ పిట్స్, అగ్రికల్చర్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, కంపోస్ట్ పిట్స్, ఇంకుడు గుంతలు గురించి రివ్యూ చేసి పెండింగ్ లేకుండా పూర్తి చేయమని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల ఎంపీడీవో, ఏపీవో, ఈసీ టెక్నికల్ అసిస్టెంట్ లు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పరిస్థితులు సమీక్షించిన ఎంపీడీవో



**వి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** మండలంలో గ్రామాలను సందర్శించి పారిశుధ్య పరిస్థితులను సమీక్షించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని గాదిరాయి, వీరవల్లి అగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ పరిస్థితులు పరిశీలించి నట్లు మాడుగుల ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. వాతావరణం దృష్ట్యా కాలువలు, తుప్పలు, రోడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు తెలియజేసినట్లు చెప్పారు. మురికి కాలువల పూడికి తీత పనులను పరిశీలించారు. ఎంపీడీవోతోపాటు గ్రామాల పంచాయతీ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# శ్రీ అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న సభాపతి కుటుంబ సభ్యులు





**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామిని రాష్ట్ర శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, వారి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 20వ వార్డు కృష్ణాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారిని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన సతీమణి చింతకాయల పద్మావతి కూడా ఆయనతో పాటు ఉన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు స్పీకర్ దంపతులను పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఈ పూజా కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, "తెలుగు ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు. ఆ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో మీరు మీ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలి" అని ఆకాంక్షించారు.

# కూటమి నుంచి టీడీపీ ఎన్నిసార్లు బయటకు రాలేదు: జ్యోతుల నెహ్రూ



**కాకినాడ:** టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కూటమి ఎన్నాళ్లు ఉంటుంది.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకోలేదు.. కూటముల నుంచి ఎన్నిసార్లు బయటకు రాలేదు అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ప్రభుత్వంలో పదవులు ఎవరికి ఇస్తున్నారు?. పార్టీ నిర్ణయాల వల్ల టీడీపీ నిర్వీర్యం అయిపోతుందని చెప్పుకొచ్చారు.

టీడీపీ కాకినాడ జిల్లా మహానాడులో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ..'కాకినాడ జిల్లాలో పదవులు ఏ పార్టీకి వెళ్లాయో ఆలోచించండి. మెజారిటీ ఉన్న తెలుగుదేశం పరిస్థితి ఏంటి?. ఒక వ్యక్తికి రెండు పదవులు అవసరమా?. (కుడా చైర్మన్, డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు). కూటమిలో పార్టీ నిర్ణయాల వల్ల టీడీపీ నిర్వీర్యం అయిపోతుంది. కూటమి ఎన్నాళ్లు ఉంటుంది.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకోలేదు. ఎన్నిసార్లు బయటకు రాలేదు.

టీడీపీతో పొత్తు వల్ల కమ్యూనిస్టు పార్టీలు నిర్వీర్యం అయిపోయాయి. అదే పరిస్థితి టీడీపీకి రాకుండా చూడాలి. నేను వాళ్లకు ఇవ్వకూడదు అని అనడం లేదు. మా నిష్పత్తి ప్రకారం టీడీపీకి కూడా ఇవ్వండి అంటున్నాను. ద్వితీయ శ్రేణి నేతలు తమ ఇంట్లో వారికి కూడా సమాధానం చెప్పలేకపోతున్నారు. మా వాటా పదవులు మాకు సక్రమంగా ఇవ్వండి' అని డిమాండ్ చేశారు.

# ఎస్సీ వర్గీకరణ రోస్టర్లో మాదిగలకు తీవ్ర అన్యాయం!

## ఏపియమ్ఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర రావు(మాదిగ)!...

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** నగరంలో ఒక ప్రముఖ హోటల్లో పెద్దాడ రమణ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర రావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ "రిజర్వేషన్లు సక్రమంగా అందని కులాలకి వర్గీకరణ మొదటి వరసలో రిజర్వేషన్లు ఇవ్వమని సుప్రీం కోర్టు చెప్పిందని, అందుకు బిన్నంగా వర్గీకరణ రోస్టర్ పాయింట్ల పేరుతో మొదటి వరుసలో రిజర్వేషన్లు అనుభవించిన మాలలకి 8, మాదిగలకి 6 ఇస్తామని చంద్రబాబు చెప్పడం ఇదేం సామాజిక న్యాయం అని విమర్శించారు. తెలుగుదేశం గెలుపుకి మాదిగలు కృషి చేస్తే తెలుగుదేశం ఓటమికి పనిచేసిన మాలలకి వర్గీకరణ పేరుతో పెద్దపీట వేసి మాదిగలకు తీవ్ర అన్యాయం చేయడం మాదిగలను నమ్మించి మోసం చేయడమేనని చంద్రబాబుని విమర్శించారు. తెలంగాణలో 11% రిజర్వేషన్లు మాదిగలకు ఇవ్వాలని రేవంత్ రెడ్డిని అడిగిన మందా కృష్ణ ఆంధ్రాలో. 6% మాదిగలకు ఇస్తామన్న చంద్రబాబుని ఎందుకు ప్రశ్నించలేదని పేరుపోగు నిలదీశారు. మందా కృష్ణ స్వార్ధ ప్రయోజనాల కోసం 30 ఏళ్ళ వర్గీకరణ ఉద్యమాన్ని చంద్రబాబుకి అమ్ముకుని మాలలతో రాజీ ఒప్పందం కుదుర్చుకుని ఆంధ్రా మాదిగలకు అన్యాయం చేసిన మాదిగ జాతి ద్రోహి మందా కృష్ణకు ఆంధ్రలో తిరిగే అర్హత లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగింది సంబరాలు చేసుకోండి అని మందా కృష్ణ పిలుపునివ్వడం సిగ్గుచేటు అన్నారు. మందా కృష్ణని అడ్డుపెట్టుకుని ఆంధ్రా మాదిగలకు చంద్రబాబు అన్యాయం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై కడపలో జరిగే మహానాడులో మాదిగలకు సమన్యాయం చేస్తానని చంద్రబాబు ప్రకటన చేయాలని వెంకటేశ్వర రావు మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై జూన్ 05న అమరావతిలో ఆంధ్ర రాష్ట్ర మాదిగ సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం జరపతలపెట్టామని మాదిగల సంఘాల నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని వెంకటేశ్వర రావు మాదిగ తెలిపారు. ఈ సమావేశంలో ఏ పి యమ్ ఆర్ పి ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ కేడర్ ఆత్మీయ సమావేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** గురువారం విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో పార్టీ క్యాడర్ ,నాయకులుతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్సార్సీపీ విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త గా నియమితులైన మొల్లి అప్పారావుకి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు, శాసనమండలి సభ్యురాలు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు, గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, రాష్ట్ర, పార్లమెంట్, సిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నర్సీపట్నంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అబీద్ సెంటర్లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అనకాపల్లి జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ మాట్లాడుతూ, ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికకు రాజీవ్ గాంధీ ఆద్యుడని తెలిపారు. భారతదేశానికి ప్రధానిగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేశారన్నారు. కంప్యూటర్లు,సెల్ ఫోన్లు, టెలికాం, ఐటీ రంగాల్లో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నేత, దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన త్యాగధనుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కొరకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాల శివ, రాజాన రాజు, అధికారి చిన్నీలు , నాయుడు, జిల్లా కార్యదర్శి సిద్ధ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహానాడు సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ



**జి.మాడుగుల/జి.కె.వీధి, (విశాఖ సమాచారమ్):-** ఈ ఏడాదిజి కె వీధి మండలం లో మరణించితెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకలు జ్ఞాపకా ర్థంమహానాడు సందర్భంగా టి ఎన్ ఎస్ ఎఫ్ ఆద్య ర్యలోగురువారం నాడు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. జి. కె వీధి మండలం లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు మాడుగుల పాపారావు వంటెద్దు అప్పలస్వామి కాకర కొండబాబు దేశగిరి బాలయ్య పడాల్ కొర్ర రాజేష్ టి ఎన్ ఎస్ ఎఫ్.దేశగిరి సన్యాసి పడాల్.మనుగూరు మోహన్ రావు మడపల లక్ష్మణ్ కుమార్.. తగ్గి పార్వతమ్మ. జర్తా బాలరాజు. కొత్తలంగి కృష్ణరావు. బూడిద చిన్నబాబు చిలకల నాగేశ్వరరావు బూడిద చిన్న రావు గెమ్మెలి ముగ్రి గార్ల జ్ఞాపకార్థం తెలుగుదేశం పార్టీ నాయకులు మామిడి రాంబాబు. వండలం బాలయ్య.గార్ల సహాయ సహకారం50 మంది మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమం లో జి. కె వీధిలో టి ఎన్ ఎస్ ఎఫ్ నాయకులు మాజీ జిల్లా కార్యదర్శి ముక్కలి కళ్యాణి జి. కె వీధి మండల అధ్యక్షులు గుంట బుజ్జి బాబు మాజీ జిల్లా టి డి పి కార్యదర్శి ముక్కలి మహేష్ నాయకులు మానుగురు చిన్నబాబు కొర్ర రాంబాబు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రామ మందిరం నమూనాను దర్శించుకున్న వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఆర్కే బీచ్ లో ఆన్ మూల్ విల్లా శ్రీ గరుడ అయోధ్య రామ మందిరం నమూనాను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారికి నిర్వాహకులు సాదర స్వాగతం పలికి ,స్వామివారి ప్రత్యేక పూజ కార్యక్రమం, అనంతరం స్వామివారి ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ సాగర తీరంలో ని అయోధ్య వెళ్లలేనివారికి ఇదొక మంచి అవకాశం అని ఆలయ నమూనా చాలా అద్భుతంగా ఉందనీ కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు , కూటమి నేతలు పాల్గొన్నారు..

# నేడు ప్రపంచ తాబేళ్ళ దినోత్సవం

ప్రపంచ తాబేలు దినోత్సవం ప్రతి సంవత్సరం మే 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. తాబేళ్ళ మనుగడపై మానవ దృష్టి సారించడానికి, వాటిని సంరక్షించేలా ప్రోత్సహించడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు.

1990లో అమెరికా లోని అమెరికన్ తాబేలు రెస్క్యూ అనే సంస్థ స్థాపించబడింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 2000లో మిస్ ఇ. రస్సెల్ ప్రపంచ తాబేలు దినోత్సవం ప్రారంభించాడు.

కాలిఫోర్నియాలోని మాలిబుకు చెందిన సుసాన్ టెల్లెం వరల్డ్ టర్టి డే (ప్రపంచ తాబేలు దినోత్సవం) అనే పదాన్ని ట్రేడ్ మార్క్ చేశాడు. జంతువుల వేడుకలకు సంబంధించిన ఛేజ్ అనే పుస్తకంలో ఈ దినోత్సవం గురించి ప్రస్తావించబడింది. ఈ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాలుగా జరుపుకుంటారు. తాబేళ్ళు, తాబేళ్ళ బొమ్మలను చాలామంది ఒకరికొకరు ఇచ్చుకుంటారు. తాబేళ్ళ వంటి



దుస్తులు లేదా ఆకుపచ్చ వేసవి దుస్తులు ధరించి వీధులలో ప్రచారం చేయడం. రహదారులపై చిక్కుకున్న తాబేళ్ళను కాపాడడం. తాబేళ్ళకు సంబంధించిన పరిశోధనలు జరపడం. పాఠశాలల్లో విద్యార్థులకు తాబేళ్ళ గురించి బోధించడం జరుగుతుంది . మన పురాణాల్లో కూడా తాబేళ్ళు గురించి ఉంది. విష్ణువు దశావతారాలులలో కూర్మావతారము రెండవది.

తాబేలు లేదా కూర్మము దృఢమైన పైకప్పుగల ప్రాచీన సరీసృపాలు. ఇవి ట్రయాసిక్ యుగం నుంచి ఎలాంటి మార్పులు లేకుండా జీవించి ఉన్న జీవులు. వీటిని అతి ఎక్కువ జీవితకాలాన్ని కలిగియున్న జీవులుగా చెప్పవచ్చు. వీటికి శంఖఖాతాలు ఉండవు.

తాబేలు దేహం పొట్టిగా అండాకృతిలో విశాలంగా ఉంటుంది. భూచరజీవుల్లో గోళ్ళను కలిగిన చలనాంగాలు ఉంటాయి. జలచర జీవుల్లో తెడ్డు వంటి చలనాంగాలు ఉంటాయి. దేహాన్ని ఆవరించి ఉన్న పెట్టె వంటి బాహ్యాస్థిపంజరం పృష్ఠకవచమైన కారపేస్, ఉదర కవచమైన ప్లాస్ట్రాన్ తో ఏర్పడి ఉంటుంది. ఉరఃకశేరుకాలు, పర్శుకలు కారాపేస్ తో కలుస్తాయి. డక్టస్ బొటాలి అనే చిన్న రక్తనాళం ద్వైహిక, పుప్పుస చాపాలను కలుపుతుంది. నాసికా రంధ్రం ఒకటి మాత్రమే ఉంటుంది. సముద్రతాబేళ్ళ వంటి కొన్ని జలచర జీవులలో జల శ్వాస క్రియను జరపడానికి రక్తనాళయుత అవసరం ఉంటుంది. వీటికి ఉరోస్థి ఉండదు. వీటి దవడలపై దంతాలు ఉండవు. దవడలను ఆవరించి కొమ్ముపొర ఉంటుంది. అవస్కర రంధ్రం నిలువుగా ఉంటుంది.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108.**

# ఏజెన్సీ గ్రామాల్లో మరలా గిరిజనులకు తప్పని రేషన్ తిప్పలు?

## ఏజెన్సీ గ్రామాలలో మొబైల్ వాహనాల ద్వారానే రేషన్ సరఫరా కొనసాగించాలి : అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి

**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** ఏజెన్సీ గ్రామాల్లో మొబైల్ వాహనాల ద్వారా గ్రామాల్లో రేషన్ సరఫరా నిలిపివేస్తే గిరిజనులు రేషన్ బియ్యం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని అరుకు మాజీ పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విలేకరులకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అరకు పార్లమెంట్ పరిధిలో రేషన్ డెలివరీ వాహనాలు తీసేస్తే అనేక ఇబ్బందులు గిరిజనులకు ఎదురవుతాయన్నారు.



ఏజెన్సీ గ్రామల్లో మొబైల్ వాహనాల ద్వారానే రేషన్ సరఫరా కొనసాగించాలన్నారు. ఏపీలో రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ సరఫరా చేస్తామని, రేషన్ డెలివరీ వాహనాలను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించడంతో గిరిజనులలో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రేషన్ పంపిణీకి 221 మొబ్కెల్ వాహనాలు ద్వారా 671 డిపోల నుండి 2 లక్షల 90,892 కార్డుదారులకు నెలకు లక్ష 40 వేల టన్నుల రేషన్ బియ్యం అందిస్తుందని, ఒక వాహనానికి ఇద్దరు చొప్పున జిల్లా మొత్తంగా 442 మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పద్ధతి రద్దు చేస్తే వారందరూ ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో గిరిజన ప్రాంతంలో ప్రతి రేషన్ కార్డు దారుడు 10 నుండి 15 కిలోమీటర్లు నడిచి బియ్యం తెచ్చుకోవలసిన పరిస్థితి తిరిగి ఏర్పడుతుందని, గిరిజనులకు ఇబ్బంది కలిగించే ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం పున: సమీక్షించి యధావిధిగా గిరిజన ప్రాంతాల్లో మొబైల్ వాహనాల ద్వారా సరఫరా చేయాలని మాజీ ఎంపీ ప్రభుత్వాన్ని కోరారు.

2nd pages1111.qxd 5/22/2025 9:35 PM Page 7



## డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభోత్సవం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జీవీఎంసీ లో ఇటీవల ఎన్నికైన శ్రీ దల్లి గోవింద రెడ్డి గారికి డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ ఛాంబర్ ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. జనసేన పార్టీ నుంచి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని , ప్రజలందరికీ సేవ మరింత ఎక్కువ చేసి ప్రజల మన్నులు పొందాలని అన్నారు . సందర్భంగా శాలువా వేసి , బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ మేయర్, కూటమి పెద్దలు , జనసేన పార్టీ పెద్దలు ,జనసైనికులు, అధిక సంఖ్యలో వీర మహిళలు పాల్గొన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు 500 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు



**అమరావతి:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏవియేషన్ హబ్ నిర్మాణంలో భాగంగా సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఐఏఎల్ సంస్థకు 500 ఎకరాల భూ కేటాయింపునకు రాష్ట్ర క్యాబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపింది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం విమానాశ్రయం అభివృద్ధి కోసం 1,733 ఎకరాలు, జాతీయ రహదారి నుంచి విమానాశ్రయ అనుసంధానం కోసం 92 ఎకరాల మేర ప్రతిపాదన చేశారు. విమానాశ్రయంలో కార్గో ఏరియా కోసం 83.5 ఎకరాలు, నార్త్ టెర్మినల్ భవనం కోసం 98 ఎకరాలు, ఎయిర్ పోర్టు బౌండరీ కోసం 494 ఎకరాల మేర ప్రతిపాదించారు. నివాస ప్రాంతం, ఇతర అవసరాల కోసం 201 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఏటా 36 మిలియన్ల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలుగా మూడు దశల్లో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. దీని ప్రకారం 2,703 ఎకరాలు కేటాయించాల్సి ఉన్నా.. వైకాపా ప్రభుత్వం 2,203 ఎకరాలు మాత్రమే కేటాయించింది. ప్రస్తుతం ప్రాజెక్టు వయబిలిటీతో పాటు భవిష్యత్ అవసరాలు, సిటీ సైడ్ డెవలప్‌మెంట్ కోసం 500 ఎకరాలు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## విశాఖ ఉక్కు కాంటాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు




**అచ్యుతాపురం, (విశాఖ సమాచారమ్):-** విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఈనెల 20వ తేదీ నుండి జరుగుతున్న సమ్మెకు మద్దతుగా ఈరోజు అచ్చుతాపురం జంక్షన్ విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ .రాము మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో పోరాడి 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను మోడీ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడం కోసం అనేక కుట్రలు చేస్తుంది స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేసిన కార్మికులను కార్మిక చట్టాలను ఉల్లంఘించి 4000 మందిని తొలగించింది మరో 2600 మందిని స్టీల్ యాజమాన్యం ప్రయత్నాలు చేపడుతుంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్టీల్ ప్లాంట్ ను పరిరక్షిస్తామని పోరాటాల్లో పాల్గొని హామీ ఇచ్చింది అధికారం వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్ రక్షించకపోగా మరింత వేగంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిర్వీర్యం చేసే విధంగా ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తున్నది పైగా పోలీసులతో తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నది ఇటువంటి విధానాలను కూటమి ప్రభుత్వం మానుకొని స్టీల్ ప్లాంట్ ను రక్షించి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరంపూడి. రమణ, రంగాల. మాధవరావు ,సన్యాసిరావు, శివకోటి. శివ .పూడి.చందు, సీరా.సంజీవరావు పాల్గొన్నారు.

## 27న అమరవీరుల స్మారక సభ



**పలాస, (విశాఖ సమాచారమ్):-** శ్రీకాకుళం జిల్లా గిరిజన సాయుధరైతాంగ పోరాటంలో అమరులైన అమర వీరుల స్మారక సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బొడ్డపాడులో జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద బుధవారం స్మారక సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా మే 27న బొడ్డపాడులో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జోగి కోదండరావు, వంకల మాధవరావు, దుష్యంతు, రామారావు, వీరాస్వామి, ధర్మారావు, పుచ్చ దుర్యోధన, బాలకృష్ణ, త్రిలోచనరావు, శ్రీరాములు, మోహిని, జగన్,అప్పయ్య, బాలరాజు, ముసలయ్య పాల్గొన్నారు.

# జీతాలు నిల్! పనులు ఫుల్! ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఆవేదన!



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** గత మూడు నెలల నుంచి మండుటెండలను సైతం లెక్కచేయకుండా కష్టించి పనిచేస్తున్న ఉపాధి హామీ గ్రామస్థాయి క్షేత్ర సహాయకులు (వీఆర్పీలకు)జీతభత్యాలు లేక పలు కుటుంబాలు పస్తులతో అలమటిస్తున్నా యనీ రావికమతం మండల ఉపాధి హామీ మండల గౌరవ అధ్యక్షులు దాసరి వరహాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన జీతాలు నేటికీ ఇవ్వకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 18 ఏళ్ల నుంచి అరకొర జీతాలతో పనిచేస్తున్న తమకు జీతాలు ఇవ్వకపోవడం పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఆరు నెలల క్రితం ప్రారంభించిన పనులను నేటి వరకు ముమ్మరంగా చేయిస్తున్నప్పటికీ జీతాలు ఇవ్వడం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యత సరికాద న్నారు. ఎనిమిది వేల రూపాయలు జీతం తప్ప ఎటువంటి అలవెన్సులు లేని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, ఎంత మంది పాలకులు మారిన వీరి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందాగా మారిందన్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు, ఉన్నత చదువులు చదువుకున్న వారికి కనీసం ప్రమోషన్ కల్పించకపోవడం,పనికి తగ్గ కనీస వేతనం కల్పించకపోవడం చాలా దారుణం అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న సిబ్బందిలో అనేకమంది టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, పలు టెక్నికల్ కోర్సులు చేసిన వాళ్లు అనేకమంది ఉన్నారన్నారు. అటువంటి వారందరికీ ప్రమోషన్లు నాటి నుంచి నేటి వరకులేకపోవడం దురదృష్టకర మన్నారు. అధికారుల నుంచి, నాయకుల నుంచి, ప్రజల నుంచి, విపరీతమైన ఒత్తిడితో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. పని విషయంలో ఎక్కడా రాజీ లేకుండా కఠినమైన నిర్ణయాలతో మెడపై కత్తి పెట్టి పని చేయిస్తున్న అధికారులకు జీతాలు ఇప్పించడం తెలియదా అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమపై విపరీతమైన ఒత్తిడి తీసుకొచ్చే పని పని చేయిస్తున్న అధికారులు జీతాల గురించి ఎందుకు మాట్లాడరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉపాధి శ్రామికుడు నెలలో నాలుగు వారాలు పనిచేసుకుంటే 7200 వేతనం వస్తుందన్నారు. అదే నెల రోజులు కష్టపడి పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్కు మాత్రం నెలకు ఎనిమిది వేల రూపాయలు మాత్రమే జీతం వస్తుందన్నారు. ఒక ఉపాధి శ్రామికుడికి అలాగే ఉద్యోగికి ఏమాత్రం తేడా లేదన్నారు. ఒక ఉపాధి శ్రామికుడు మరణిస్తే ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. అదే ఒక ఫీల్డ్ అసిస్టెంట్ మరణిస్తే కనీసం ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేదన్నారు. తెల్లవారిన దగ్గర నుంచి రాత్రి వరకు పొలాలు, కాలువలు, కొండలు, పెద్దపెద్ద జంగిల్, ఉన్న ప్రాంతాలలో పనిచేస్తున్నప్పుడు అనేక విష సర్పాలు సైతం దాటుకొని పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి చాలా అన్యాయం జరుగుతుందన్నారు. పలు రకాల పనులను గుర్తించడం, వాటిని ఎస్టిమేట్ వేయించడం, పనికి డిమాండ్ పెట్టడం, అందరికీ పని కల్పించడం, జాబు కార్డ్ లేని వారికి జాబ్ కార్డు ఇప్పించటం, 100 రోజులు పని ఇప్పించడం, ప్రభుత్వ నిర్దేశించిన 307 రూపాయలు ఇచ్చే విధంగా పనిచేపించడం, అలాగే సమావేశాలకు హాజరు కావడం, పని పూర్తి చేసిన మాస్టర్లు ఆఫీసుకి అందజేయడం, మరలా తిరిగి డిమాండ్ పెట్టిన వాటికి కొత్త మాస్టర్లు తీసుకువెళ్లి ఫీల్డ్ లో పెట్టడం ఇలా అనేక రకాల పనులను చేపిస్తున్న సిబ్బందికి జీతాలు ఇచ్చే విషయంలో తార్సారం చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు. అయితే గత ఐదు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్క రూపాయి జీతం కూడా పెంచలేదన్నారు. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెంచిన జీతంతోనే నేటి వరకు తాము పనిచేస్తున్నామన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వంలోనే ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు మేలు జరుగుతుంది అన్నారు. కాబట్టి అధికారంలో కోన తెలుగుదేశం ప్రభుత్వ పెద్దలు ఫీల్డ్ అసిస్టెంట్లు అందరకు పనికి తగ్గ జీతాలను ఇవ్వాలని,ఉన్నత ఉన్నత చదువులు చదువుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఒక ఫీల్డ్ అసిస్టెంట్ మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునే దిశగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అధికారుల నుంచి ఒత్తిడి తగ్గించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు మచ్చ శ్రీనివాసరావు, కార్యదర్శి వి శ్రీను పలువురు ఉన్నారు.

## విశాఖ బీచ్ రోడ్డులో రెండో రోజు యోగాసనాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** యోగాంధ్ర వేడుకల్లో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం ఆర్.కె. బీచ్ వద్ద యోగాసన ప్రక్రియలు నిర్వహించారు. విశాఖపట్నం వేదికగా యోగా ఫర్ వన్ హెల్త్, వన్ ఎర్త్ ' నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత భారీగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. యోగాంధ్ర 2025కు విస్తృత ప్రచారం కల్పించడం, భారీ సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు నెల రోజుల కార్యాచరణ ప్రభుత్వం రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం, ఆయుష్, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్లో యోగా అభ్యాసకులు, శిక్షకులు యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు బీచ్ రోడ్లో వేసిన ఈ స్టేజ్ నెల రోజులపాటు అలాగే ఉంటుందని, శిక్షకులు, అభ్యాసకులు నిత్యం యోగాసనాలు వేస్తారని డి.ఆర్.ఓ. భవానీ శంకర్ తెలిపారు.

## సమస్యల వలయంలో రాజ్యాం ప్రజలు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** గత 6 నెలలుగా మండలంలోని రాజాం గ్రామంలో పలు సమస్యలు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయని వార్డు సభ్యుడు ఆకుల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్థానిక పరిపాలనలో స్థిరత లేకపోవడం, అధికారులు తాత్కాలికంగా మారిపోవడం వల్ల ప్రజల నిత్యజీవితం సమస్యలతో నిండి పోయిందని అన్నారు. ముఖ్యంగా గ్రామంలో పలు వీధుల్లో పారిశుధ్యం లోపం తో ప్రజలు ఆరోగ్య సమస్యలు తో బాధ పడుతున్నారన్నారు. ఈ గ్రామం లో ప్రతి మూడు నెలలకు ఒకసారి పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో మారిపోవడం వల్ల పారిశుధ్యం విషయం లో గణనీయమైన లోటు కనిపిస్తుందన్నారు.

ఈ కారణంగా గ్రామ ప్రజలు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

మరణ ధ్రువ పత్రాల నిదాన జారీ కారణంగా శవాంతక్రియల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని భూముల సమస్యలు రైతుల ఇబ్బందులు పడుతున్నారని భూముల మ్యూటేషన్, ఆన్‌లైన్ అప్డేట్లు ఆగిపోవడం వల్ల రైతులు అన్నదాత సుఖీభవ లబ్ధి పొందలేకపోతున్నారు.

ఆక్రమణదారులు ప్రభుత్వ భూములు, చెరువుల గట్టు తదితర ప్రాంతాలను ఆక్రమిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని అంగన్వాడీ సెంటర్లు, బాల ఆరోగ్యం మూడు అంగన్వాడీ సెంటర్లలో రెండు మంచి భవనాలు ఉన్నా పరాయిపంచ ఉండడం తో సేవల లో లోపం ఎదురవుతుందన్నారు.

చిన్న పిల్లల పోషణ, ఆరోగ్యం పట్ల అధికారుల అజాగ్రత్త వహిస్తున్నారని విద్యుత్ సరఫరాలో తీవ్ర సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని రాజాం వద్దే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా గ్రామానికి 24గంటల విద్యుత్ ఇవ్వడం లేదన్నారు. విద్యుత్ అధికారులు అవినీతికి లొంగి, ఇతర గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేదలు, వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థులు విద్యుత్ లోపం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**అక్రమ నిర్మాణాలు, ఎన్ఓసీ లేకుండా కట్టడాలు**

పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు జరగడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాల అవకాశం ఉందని ఈ సమస్యలు లో ప్రతి అంశాన్ని గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖాధికారులు సీరియస్‌గా తీసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపించకపోతే అవినీతి పుడుతుందని ప్రభుత్వం మారింది కానీ ప్రజా సమస్యలపై స్పందన మారలేదన్నారు.

# జాతీయ స్థాయిలో గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష

## మెడ్‌టెక్ జోన్‌తో కలిసి ఎంబిఎ కోర్సు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో నిర్వహిస్తున్న యుజి మరియు పిజి మేనేజ్‌మెంట్ కోర్సులలో ప్రవేశాలకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. గీతం లో గురువారం తేది : 22-05-2025న నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిరచారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఎ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఎ (ఫైనాన్సియల్ మార్కెట్స్), జనరల్ బిబిఎ కోర్సులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మరియు అకాడమి ఆఫ్ హస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఎ హస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడిరచారు. తరగతి గది బోధనతో పాటు వైద్య రంగంలో అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ అనుభవాలను జోడిస్తూ ఈ కోర్సును రూపొందించామని, పెరుగుతున్న ఆసుపత్రుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్య రంగానికి అవసరమైన విధంగా ఎంబిఎ హెల్త్‌కేర్ అండ్ హస్పటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ద్వారా నిపుణులను అందించాలన్నది తమ లక్ష్యం అన్నారు. ఈ కోర్సులకు సంబంధించి ప్రవేశాలకు గాను గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ %-%2025 (జిబాట్)ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎద్కైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ తత్సమాన కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఆసక్తి గల విద్యార్థులు గీతం అడ్మిషన్ టెస్ట్-2025 ధరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా ఎంబిఎ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్ళను అధ్యయనం చేయడం పరిష్కారాలు కనుగొనడం పై శిక్షణ ఇవ్వటానికి యుఎస్ఎ మరియు యుకె లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని డీన్ తెలిపారు. గీతంలో ఎంబిఎ అభ్యసించే విద్యార్థులు ఐసిఐపి కార్యక్రమంలో భాగంగా అమెరికా, యుకెలలోని భాగస్వామ్య విశ్వవిద్యాలయాలకు వెళ్ళి తొమ్మిది నెలల పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేస్తారని, అలాగే భాగస్వామ్య విశ్వవిద్యాలయాలలోని ఫ్యాకల్టీ సభ్యుల మధ్య పరస్పర మేధో సహకారం ఏర్పడుతుందన్నారు. అంతర్జాతీయ కార్పొరేట్ రంగ వాతావరణాన్ని పరిశీలించి అధ్యయనం చేసే అవకాశం వల్ల ఎంబిఎ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఆయన పేర్కొన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీల నిర్వహణ

### అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు



**అనకాపల్లి/రోలుగుంట, (విశాఖ సమాచారమ్ (ప్రతినిధి):-** రోలుగుంట మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న క్వారీలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వచ్చి సుమారు రెండు నెలలు గడుస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పివి ఎస్ఎన్ రాజు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఎటువంటి అధికారిక అనుమతులు లేని క్వారీల నుండి నిత్యం వందలాది లారీలతో బహిరంగంగానే మెటీరియల్ను తరలిస్తున్న క్వారీ యాజమాన్యాల పట్ల చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అలాగే అనుమతులు ఉన్న క్వారీలు కూడా నిబంధనలను ఉల్లంఘించి మైనింగ్ చేస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా శ్రేయస్సు గూర్చి పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలు అభివృద్ధి చెందే క్రమంలో సహజ వనరులను సక్రమంగా వినియోగించాలని స్పష్టం గా ఆదేశిస్తున్న మైనింగ్ కార్యక్రమాలు చేసేటప్పుడు సంబంధిత ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు, నీటి వసతులు దెబ్బతినకుండా, పర్యావరణానికి హాని కలగకుండా, ప్రజలుకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా చూడవలసిన క్వారీ యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘన చేస్తున్నా వారిపై ఏ స్థాయిలో కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఖండనీయమని ఒక ప్రక్క రహదారుల నిర్మాణం కొరకు తాము పనిచేస్తుంటే వాటిని మైనింగ్ వ్యాపారాలు ధ్వంసం చేస్తున్నారని, అలాగే ఈ క్వారీ యాజమాన్యాలు చేస్తున్న అక్రమాలకు అండదండగా ఉంటూ వారి నుండి అనునిత్యం డబ్బు వసూలు చేస్తున్న రాజకీయ నాయకులు, అధికారులకు సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని రాజు అన్నారు.

## 24, 25, 26 తేదీల్లో ఐద్వా రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) రాష్ట్ర శిక్షణ తరగతులు మే 24, 25, 26 తేదీల్లో అనకాపల్లి జిల్లా తిమ్మరాజుపేట గ్రామంలో జరగనున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రభావతి తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి 300 మంది ప్రతినిధులు హాజరు అవుతున్నట్లు గురువారం ఏర్పాటు చేసిన విలేకరులకు సమావేశంలో చెప్పారు. మూడు రోజులపాటు వివిధ అంశాల మీద రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల పట్ల మహిళకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా బి ప్రభావతి మాట్లాడుతూ దేశంలో మహిళల పట్ల వివక్షత, హింస నానాటికి పెరుగుతుంది. సమాజంలో మహిళలకు పురుషులతో పాటు సమానంగా అవకాశాలు కల్పించినప్పుడే అణిచివేత అంతమవుతుందని అన్నారు. దేశంలో సాగిన అనేక పోరాటాలు ఫలితంగానే రాజ్యాంగంలో మహిళలకు హక్కులు కల్పించబడ్డా యని అన్నారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు నేటికీ కల్పించలేదని విమర్శించారు. ఆజాది అమృత ఉత్సవాలు జరుపుకుంటున్న దేశంలో స్త్రీలకు ఒరిగిందేమీ లేదన్నారు. బిజెపి ప్రభుత్వ అధికారం లోకి వచ్చిన తర్వాత మహిళ మీద దాడులు హింస పెరిగింది అన్నారు. మహిళ మీద దారుణాలు పాల్పడిన వారు నిర్దోషులుగా చలామణి అవుతున్న బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. మహిళలు రక్షణ కోసం ఐద్వా కృషి చేస్తుందని అన్నారు. సమాజం పట్ల చైతన్యతంగా మెలిగేందుకు నిర్వహిస్తున్న ఐద్వా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు పద్మ, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పి. మాణిక్యం, డి.డి.వరలక్ష్మి, రొంగలి లక్ష్మి, వాణి, తదితరులు పాల్గొన్నారు.

2nd pages1111.qxd 5/22/2025 9:35 PM Page 8






# ముంబయి ఇండియన్స్‌కు పెనాల్టీగా నోబాల్



**స్పోర్ట్స్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ముంబయి ఇండియన్స్ దిల్లీ క్యాపిటల్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఓ రూల్ బ్రేక్ చేసినందుకు అంపైర్లు ముంబయి ఇండియన్స్‌కు నోబాల్‌ను పెనాల్టీగా విధించారు. అయిదో ఓవర్లో మూడో బంతిని విల్‌జాక్స్ విసిరాడు. దాన్ని విప్రాజ్ నిగమ్ ఎదుర్కొన్నాడు. ఆ బాల్‌ను అంపైర్ నోబాల్‌గా ప్రకటించాడు. ఆ సమయంలో ఆఫ్‌సైడ్‌లో కేవలం ముగ్గురు ఫీల్డర్లే ఉండటం దీనికి కారణం. నిబంధనల ప్రకారం ఆన్‌సైడ్‌లో అయిదుగురికి మించి ఫీల్డర్లు ఉండకూడదు. కాని ఉండటంతో అంపైర్ నోబాల్‌ను పెనాల్టీగా విధించాడు.

ఇక మ్యాచ్ విషయానికొస్తే... ఈ పోరులో సూర్యకుమార్ యాదవ్ 73వి పరుగులతో తన సత్తా చాటి, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 180 పరుగులు చేసింది. బదులుగా దిల్లీ క్యాపిటల్స్ 18.2 ఓవర్లకు 121 పరుగులకే కుప్పకూలింది. దీంతో ముంబయి ఇండియన్స్ 59 పరుగులతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ముంబయి ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. దీంతో దిల్లీ క్యాపిటల్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

# వైభవ్ సూర్యవంశీకి 500 ఫోన్‌కాల్స్

**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో అరంగేట్రం చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తాను ఆడిన మూడో మ్యాచ్‌లోనే సంచలనం సృష్టించాడు. ఏప్రిల్ 28న గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. గుజరాత్ బౌలింగ్‌ను తుత్తినియలు చేస్తూ కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఇది ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకం. అలాగే ఐపీఎల్‌లో అతిపిన్న వయసులో సెంచరీ కొట్టిన క్రికెటర్‌గా నిలిచాడు. ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ 252 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ ఉన్నాయి.

రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో సూర్యవంశీ మాట్లాడుతూ.. ఓ ఆసక్తికరమైన అంశాన్ని పంచుకున్నాడు. సెంచరీ సాధించిన తర్వాత తనకు 500 ఫోన్ కాల్స్ వచ్చాయని తెలిపాడు. రాబోయే మ్యాచ్‌లపై దృష్టిపెట్టడానికి ఏకంగా నాలుగు రోజుల పాటు తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసినట్లు వెల్లడించాడు. 'నేను గత మూడు, నాలుగు సంవత్సరాలుగా సన్నద్ధమవుతున్నాను. దాని ఫలితాలను కూడా చూశా. ఒకప్పుడు కష్టంగా అనిపించిన విషయాలన్నీ ఇప్పుడు సులభంగా మారాయి. దృష్టి కేంద్రీకరించడం ముఖ్యమని నేను గ్రహించాను. జట్టుకు అవసరమైన మేరకు మాత్రమే ఆడాలి. ఈ స్థాయిలో అవసరం లేని పనులు చేయడానికి అస్సలు ప్రయత్నించకూడదు' అని వైభవ్ సూర్యవంశీ అన్నాడు.

అలాగే తాను సెంచరీ సాధించిన తర్వాత తనకు వచ్చిన ఫోన్‌కాల్స్ గురించి కూడా మాట్లాడాడు. 'నేను సెంచరీ చేసిన



తర్వాత.. నా ఫోన్‌కు ఏకంగా 500 మిస్స్‌డ్ కాల్స్ వచ్చాయి. తర్వాత జరిగే మ్యాచుల కోసం సన్నద్ధమవడం కోసం.. నేను నా ఫోన్‌ను ఓ నాలుగు రోజులు స్విచ్ ఆఫ్ చేయాల్సి వచ్చింది. నేను నా కుటుంబ సభ్యులు, కొంతమంది స్నేహితులతో మాత్రమే ఉండటానికి ఎక్కువగా ఆసక్తి చూపుతాను' అని వైభవ్... రాజస్థాన్ రాయల్స్ హెడ్‌కోచ్ ద్రవిడ్‌తో మాట్లాడుతున్న క్రమంలో అన్నాడు.

'ఇది నీకు చాలా గొప్ప సీజన్. చాలా బాగా ఆడావు. ఇలాగే కొనసాగించడానికి ప్రయత్నించు. మరింత శిక్షణ పొందు. కానీ ఒక్క విషయం గుర్తుపెట్టుకో. వచ్చే సీజన్‌లో బౌలర్లందరూ నీకోసం ఓ ప్రత్యేక ప్రణాళికతో వస్తారు. కాబట్టి నువ్వు కూడా దానికి సిద్ధంగా ఉండాలి. మరిన్ని నైపుణ్యాలను పెంపొందించుకోవాలి' అని ద్రవిడ్.. వైభవ్ సూర్యవంశీకి సూచించాడు.

# ముంబయి ఇండియన్స్ టాప్-2లోకి దూసుకుపోవాలంటే..



**ఇంటర్నెట్ డెస్క్:** ప్లేఆఫ్స్‌లో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్న ముంబయి ఇండియన్స్‌కు రెండో స్థానానికి ఎగబాకే అవకాశం ఉంది. అది ఎలాగంటే... ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 59 పరుగులతో విజయం సాధించింది. బౌలింగ్‌లో మిచెల్ శాంట్నర్ (3/11), జస్ప్రీత్ బుమ్రా (3/12), బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ (73వి) రాణించడంతో ముంబయి ప్లేఆఫ్స్‌లో చివరి బెర్త్‌ను సొంతం చేసుకుంది. గతంలో అయిదు సార్లు ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న ముంబయి ఇండియన్స్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. అయితే ముంబయి రెండోస్థానంలోకి దూసుకెళ్లే అవకాశం కూడా ఉంది. ఇది జరగాలంటే మాత్రం పంజాబ్ కింగ్స్‌తో మరికొన్ని రోజుల్లో జరగనున్న మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ జట్టు కచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. ముంబయి టీమ్ ఇప్పటి వరకు ఆడిన 13 మ్యాచుల్లో ఎనిమిదింట్లో విజయం సాధించింది. 16 పాయింట్లతో పట్టికలో నాలుగోస్థానంలో ఉంది. జైపూర్ వేదికగా మే 26న పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ జరగనుంది. లీగ్ దశలో ముంబయికి ఇదే చివరి పోరు. ఇందులో విజయం సాధిస్తే ముంబయి 18 పాయింట్లకు చేరుకుంటుంది.

అయితే ఈ మ్యాచ్‌లో గెలిచినంత మాత్రానే ముంబయికి రెండోస్థానం దక్కదు. మరికొన్ని సమీకరణాలూ కలసిరావాల్సి ఉంటుంది. ప్రస్తుతం 18 పాయింట్లతో ఉన్న గుజరాత్ టైటాన్స్ మొదటి స్థానంలో, 17 పాయింట్లతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , పంజాబ్ కింగ్స్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్.. లీగ్ దశలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ , చెన్నై సూపర్ కింగ్స్‌తో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంది. రెండో స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. సన్‌రైజర్స్ హైదరాబాద్ , లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడాల్సి ఉంది. మూడో స్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్.. దిల్లీ, ముంబయితో తన చివరి రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

ముంబయి ఇండియన్స్ జట్టు టాప్-2 లోకి రావాలంటే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ మిగతా మ్యాచుల్లో ఓడిపోవాల్సి ఉంటుంది. అలాగే పంజాబ్ కింగ్స్‌తో జరగాల్సి ఉన్న తమ చివరి మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ కచ్చితంగా గెలవాలి. ఇలా జరిగితే ముంబయి తనకంటే ముందున్న రెండు జట్లను నెట్ రన్‌రేట్, పాయింట్ల విషయంలో అధిగమించి రెండో స్థానంలోకి చేరుకుంటుంది. దీనికి మొత్తం మూడు అవకాశాలున్నాయి.

అవకాశం 1: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు లీగ్ దశలో మిగిలిన తమ రెండు మ్యాచ్‌లను ఓడిపోవాల్సి ఉంటుంది. ఇదే జరిగితే.. గుజరాత్ టైటాన్స్ 22 పాయింట్లతో మొదటి స్థానంలో, 18 పాయింట్లతో ముంబయి ఇండియన్స్ రెండో స్థానంలో, 17 పాయింట్లతో ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ మూడు, నాలుగు స్థానాల్లో నిలుస్తాయి.

అవకాశం 2: గుజరాత్ టైటాన్స్, ఆర్సీబీ తమకు మిగిలి ఉన్న మ్యాచుల్లో ఓడిపోతే.. 19 పాయింట్లతో పంజాబ్ కింగ్స్ మొదటి స్థానంలో, 18 పాయింట్లతో ముంబయి ఇండియన్స్ రెండో స్థానంలో, గుజరాత్ టైటాన్స్ మూడో స్థానంలో, 17 పాయింట్లతో ఆర్సీబీ నాలుగో స్థానంలో ఉంటాయి.

అవకాశం 3: ఒకవేళ పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మిగిలిన మ్యాచుల్లో ఓడిపోతే.. 21 పాయింట్లతో ఆర్సీబీ మొదటి స్థానంలో, 18 పాయింట్లతో ముంబయి ఇండియన్స్ రెండో స్థానంలో, గుజరాత్ టైటాన్స్ మూడో స్థానంలో, పంజాబ్ కింగ్స్ 17 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలుస్తాయి.

# కాన్స్ ఫెస్టివల్‌లో సతీమణి.. భార్యను చూసి మురిసిపోతున్న హీరో!

ఫ్రాన్స్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో హీరో సిద్ధార్థ్ సతీమణి అదితి రావు హైదరీ సందడి చేసింది. ఎరుపు రంగు చీరలో కనిపించి అభిమానులను మెప్పించింది. నుదుటన సిందూరం ధరించి శారీ లుక్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తన భార్యను అలా చూసిన సిద్ధార్థ్ ప్రశంసలు కురిపించారు. మై లవ్ ?ఎట్ కేన్స్ అంటూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఫోటోను షేర్ చేశారు. ఫ్రెంచ్ రివేరాలో జరిగిన ప్రతిష్టాత్మక వేడుకలో అదితిరావు హైదరీ ప్రత్యేకమైన శారీలో అందరి దృష్టిని ఆకర్షించింది.

సిద్ధార్థ్ తన సతీమణి ఫోటోను పోస్ట్ చేసి అద్భుతంగా ఉందంటూ కొనియాడారు. ఆమె ధరించిన 'సిందూర్'ను కూడా ప్రస్తావించాడు. సిందూర్ అంటూ హైలెట్ చేశాడు. సిద్ధార్థ్‌ను వివాహం చేసుకున్న తర్వాత అదితి కేన్స్‌లో కనిపించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కాగా.. ఇటీవల భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మన కేంద్రం ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరిట ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. కేన్స్ ఫెస్టివల్‌లో సినీ తారలు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. బాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్యరాయ్ సైతం నదుటన



సిందూరం ధరించిన వైట్ శారీలో మెరిసింది.

కాగా.. హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదిత రావు హైదరీతో కలిసి 2021లో మహా సముద్రం చిత్రంలో నటించారు. ఈ మూవీ సెట్స్‌లోనే వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఆ తర్వాత దాదాపు మూడు సంవత్సరాలుగా డేటింగ్‌లో ఉన్నారు. ఆ తర్వాత వారు తెలంగాణ వనపర్తిలోని ఒక ప్రాచీన ఆలయంలో వివాహం చేసుకున్నారు.

# కొత్త రోబో పనిమనిషి

ఇంటి పనులు చేయటంలో రోబోలు రోజురోజుకీ తెలివి మీరుతున్నాయి. ఏ ఇంట్లోనైనా.. అంటే ఇంతకు ముందు తమకు తెలియని ప్రదేశాల్లోనూ పనిచేసేలా రూపొందుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) శిక్షణతో కొత్త చోట్ల కూడా ఇంటిని శుభ్రం చేయటం, పక్క సర్దటం వంటి పనులు నేర్చేసుకుంటున్నాయి.

ఇంటి పనులు చేయటంలో రోబోలు రోజురోజుకీ తెలివి మీరుతున్నాయి. ఏ ఇంట్లోనైనా.. అంటే ఇంతకు ముందు తమకు తెలియని ప్రదేశాల్లోనూ పనిచేసేలా రూపొందుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) శిక్షణతో కొత్త చోట్ల కూడా ఇంటిని శుభ్రం చేయటం, పక్క సర్దటం వంటి పనులు నేర్చేసుకుంటున్నాయి. ఫలితంగా రోజువారీ పనులకు ఉపయోగపడే రోబోలు మరింత విస్తృతం కావటానికి మార్గం సుగమమవుతోంది.

చాట్‌జీపీటీ వంటి టూల్స్‌కు శిక్షణ ఇచ్చే లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు (ఎల్‌ఎల్‌ఎమ్స్) రోబోల పనితీరు మెరుగు పడటానికీ ఉపయోగ పడుతున్నాయి. మాటల ఆదేశాలను అర్థం చేసుకొని, వాటి ప్రకారం నడచుకోవటంలో పురోగతి సాధిస్తున్నాయి. కాకపోతే చాలా రోబోలు తాము శిక్షణ పొందిన వాతావరణంలోనే సరిగ్గా పనిచేస్తుంటాయి. కొత్త, తెలియని ప్రదేశాల దగ్గరికి వచ్చేసరికి వీటి నైపుణ్యం గణనీయంగా పడిపోతుంది. ఇలాంటి ఇబ్బందిని అధిగమించటానికే ఫిజికల్ ఇంటెలిజెన్స్ అనే రోబోటిక్ కంపెనీ సరికొత్త కృత్రిమ మేధను రూపొందించింది. దీని పేరు పై0.5. గతంలో ఎన్నడూ చూడని ఇళ్లలో రోబోలు పనిచేయటానికి వీలు కల్పించటం దీని ప్రత్యేకత. ఈ మోడల్‌కు అనూహ్య వనరుల నుంచి సేకరించిన విస్తృతమైన డేటాతో శిక్షణ ఇవ్వటం గమనార్హం. ప్రయోగశాలలో, ఇంటి వాతావరణాల్లో పనిచేసే వేర్వేరు రకాల రోబోలకు చెందిన సమాచారంతో పాటు వెబ్ నుంచి సంగ్రహించిన ఇమేజ్, వస్తువుల డేటాతోనూ పనులను నేర్పించారు. అనంతరం పై0.5 మోడల్‌తో కూడిన రోబోలు ఎలా పనిచేస్తున్నాయో పరీక్షించారు. వీటికి సింక్‌లో పాత్రలను పెట్టటం, విడిచిన దుస్తులను బుట్టలో వేయటం వంటి పనులు చేసేలా సూచనలు ఇచ్చారు. అయితే అన్నిసార్లూ ఇవి కచ్చితంగా పనిచేయలేదు. కానీ ఎక్కువ ఇళ్లలో పరీక్షించటం ద్వారా



అంచనా వేసే సామర్థ్యం మెరుగు పడుతూ రావటం విశేషం. లాంగ్వేజ్ మోడళ్లకు ఎంత ఎక్కువ డేటాతో శిక్షణ ఇస్తే అంత మెరుగ్గా పనిచేస్తున్నట్టుగానే పై0.5 కూడా సామర్థ్యాన్ని పెంచుకుంటూ వస్తోందన్నమాట. ఉదాహరణకు- ప్రత్యేకంగా రూపొందించిన శిక్షణ వాతావరణంలో పరీక్షించిన వాటితో సమానంగానే 100 ఇళ్లలో పనిచేసిన రోబో పనిచేయగలదన్నమాట. ఇలాంటి మోడళ్లు ఎట్టకేలకు పనులను జనరలైజ్ చేయగల స్థితికి చేరుకోవటం ఆసక్తి కలిగిస్తోందని, రోబోలను నిజ వాతావారణాల్లోకి తీసుకురావటానికివి తోడ్పడగలవని పరిశోధకులు చెబుతున్నారు. కాకపోతే ఈ రోబోలు మనుషుల కన్నా చాలా తక్కువ వేగంతో పనిచేస్తుండటం అడ్డంకిగా నిలుస్తోంది. దీన్ని అధిగమించగలిగితే ఇంటి పనులు చేసే రోబోలు చాలాచోట్ల ప్రత్యక్షమైనా ఆశ్చర్యపోనవసరం లేదు.

# యోగా డే ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు చేయాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖ వేదికగా జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ ముందు భాగంలో నిర్ణయించిన ప్రధాన వేదిక వద్ద పక్కా ఏర్పాట్లు చేయాలని వివిధ బృందాలుగా నియమించిన అధికారులను జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. కాళీమాత టెంపుల్ వద్ద దేశ ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు యోగాసనాలు వేస్తారని అదే ప్రధాన వేదికగా పరిగణించాలని, అక్కడ 15వేల మంది భాగస్వామ్యం అవుతారని పేర్కొన్నారు. ప్రధాన వేదికకు కొనసాగింపుగా పార్కు హోటల్ వరకు 50 వేల మంది పాల్గొంటారని, ఒక్కో కంపార్ట్మెంట్ కు వెయ్యి మంది చొప్పున కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం ఉదయం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. 200 మీ. పొడవు, 12 మీ. వెడల్పు కలిగే విధంగా కంపార్ట్మెంట్లను తయారు చేయాలని, దానికి తగిన మ్యాపులు సిద్ధం చేసి నివేదించాలని సూచించారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హోటల్ వరకు వచ్చే అతిథులకు అనుగుణంగా ఎవరు ఎక్కడకు చేరుకోవాలో తెలియజేస్తూ నివేదికలు రూపొందించాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. కంపార్ట్మెంట్ ప్రకారం ఎవరు ఎక్కడికి చేరుకోవాలని, ఎవరి వాహనాలు ఏ ప్రాంతంలో పార్కింగ్ చేయాలి అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో 2.50 లక్షల మంది భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

**బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ వద్ద ప్రధాన వేదిక..?**

జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ప్రధాన వేదిక కాళీమాత టెంపుల్ ముందుభాగమే ఖరారు కానుందని జేసీ అన్నారు. అక్కడ ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో పాటు 15 వేల మంది ఆశీనులవుతారని పేర్కొన్నారు. అక్కడ నుంచి కొనసాగింపుగా పార్కు హోటల్ వరకు సుమారు 50 వేల మంది భాగస్వామ్యం అవుతారని వివరించారు. సాగర తీరం వెంబడి భీమిలి వరకు యోగాసనాల ప్రక్రియ ఉంటుందని, దానిలో భాగంగా ఆరు టీంల ద్వారా ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. పార్కు హోటల్ నుంచి తెన్నేటి పార్కు వరకు, తెన్నేటి పార్కు నుంచి కైలాసగిరి వరకు, కైలాసగిరి నుంచి రుషికొండ వరకు, రుషికొండ నుంచి తిమ్మాపురం వరకు, తిమ్మాపురం నుంచి భీమిలి వరకు ఒక్కో బృందం బాధ్యత వహించాలని, ప్రత్యేక కంపార్ట్మెంట్లను రూపొందించాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు సమీపంలో పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ నుంచి కంపార్ట్మెంట్లకు సులభంగా చేరుకునేలా పక్కా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి బృందంలో ఎస్డీసీ, జోనల్ కమిషనర్, తహశీల్దార్, 20 మంది వాలంటీర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో ప్రధాన వేదికతో పాటు ఇతర సాగరతీరంలో గుర్తించిన ప్రాంతాల్లో పక్కా ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేసీ సూచించారు.

జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుధాసాగర్, మధుసూదన రావు, జీవీఎంసీ సీఈ, పలువురు జిల్లా స్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎ.పి.జి.ఎల్.ఐ. క్లైయిమ్ లకు ఆమోదం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఎ.పి.జి.ఎల్.ఐ కార్యాలయము, ఉమ్మడి విశాఖ జిల్లా వారు ఆర్థిక సంవత్సరము 2024-25, 2025-26 (మే నెల) వరకు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల ఎపిజిఎల్ఐ క్లైములు మరియు లోన్‌లను ఆమోదించి యున్నారు. తదుపరి అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సంబంధిత డి&డిఓ లాగిన్‌లో లాగిన్ బిల్లులను సమర్పించకుండా పెండింగులో ఉన్నట్లుగా గమనించడమైనది. ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల నిమిత్తము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు ఉత్తర్వులు జి.ఓ.నం. 23, తేది. 15.05.2025 జారీ చేసియున్నందున, మీ కార్యాలయము నందు ఉద్యోగులు వేరొక కార్యాలయమునకు బదిలీ జరగక ముందే ప్రస్తుత డి&డిఓ లు నిధి పోర్టల్ లో వారి లాగిన్ లో పెండింగులో గల ఉద్యోగుల ఎపిజిఎల్ఐ క్లైములు, ఋణముల బిల్లులను నిధి పోర్టల్ లో జనరేట్ చేసి సిఎఫ్ఎంఎస్ ద్వారా జి.ఓ.ఆర్.టి. నం. 1512, తేది. 01.06.2020 ప్రకారము ఈ నెల 16వ తేది నుండి 25 వ తేది లోగా బిల్లులు సమర్పించగలరు. లేనిచో తదుపరి సాంకేతిక సమస్యలు వచ్చి ఆలస్యము జరుగునని ఎ.పి.జి.ఎల్.ఐ సంయుక్త సంచాలకులు లక్ష్మీ తెలియజేశారు.

Homage

ईश्वरो विक्रमी धन्वी मेधावी विक्रमः क्रमः ।
अनुत्तमो दुराधर्षः कृतज्ञः कृतिः आत्मवान ।।
विष्णु सहस्रनाम श्लोक : ९



Dr K Vikram Rao
29.05.1938-12.05.2025

Senior journalist and National President of the Indian Federation of Working Journalists (IFWJ) has left for his heavenly abode. Prayers and Terahvin (13th day) will be held on 24.05.2025. We humbly request you to join in paying tribute to the departed soul.

PRAYERS AND TERAHVIN
Saturday 24 May 2025 | 2:00 pm onwards

Venue: 'Saket', Northern Railway Officer's Club, Vivekanand Marg, Lucknow.
Mobile No. 9415010300, 9838040404 (K Vishwadev Rao)

In Mourning
(Kotamraju & Caduveti Family)

K.N. Rao (Brother)
Dr. K. Sudha Rao (Wife)
Hemant Sharma (Sister)
Vijayalakshmi Rao
Pradeep & Sharda
Vinita & Vinay
Sudev & Padmini
Vishwadev & Ila
Gautam & Venetia
Gaurav & Varsha
Satyavati
Swamini Vedavedyananda
Madhav & Meena
Neelkanth & Tripura
Anant & Vishala

(Grandchildren)
Jashoda Priya, Adwita, Jaiaditya, Jaiadvait, Joshita, Kaushalya (Devina)

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com